RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్
సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-వరంగల్ రంగారెడ్డి ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :04 సంచిక :23 ఆదివారం 19 ఏప్రిల్ 2026 పేజీలు -8 వెల రూ 5-00

## ప్రతిపక్షాలు చరిత్రలో మహిళా ద్రోహులుగా మిగిలిపోతాయి: కిషన్‌రెడ్డి

**ఢిల్లీ, ఏప్రిల్ 18 :** నియోజకవర్గాల పునర్విభన బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంట్‌లో వీగిపోవడం దురదృష్టకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ బిల్లులను అడ్డుకోవడం చారిత్రాత్మక తప్పిదమని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చరిత్రలో మహిళా ద్రోహులుగా మిగిలిపోతాయని విమర్శించారు. ఈరోజు(శనివారం) ఢిల్లీ వేదికగా మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రజలకు ఇండియా కూటమి నేతలు చెప్పలేకపోయారని పేర్కొన్నారు. 50 శాతం సీట్లు పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పామని, అన్ని పార్టీలతో తాము మాట్లాడామని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. లోక్‌సభలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వాళ్లకు తెలియజేసే ప్రయత్నం చేశామని తెలిపారు. ఈ బిల్లులపై కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదని చెప్పిందని అన్నారు. ఇండియా కూటమి నేతలు కుట్ర చేసి మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల బిల్లును అడ్డుకున్నారని ఆగ్రహించారు. కాంగ్రెస్ అనేకసార్లు మహిళా రిజర్వేషన్ బిల్లులో ద్వంద వైఖరి అవలంబించిందని ధ్వజమెత్తారు.

రిపోర్టర్లు కావలెను
ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను
సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యులేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.
ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్‌కు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

## రక్తసంబంధం వర్సెస్
# రాజకీయ పంతం

**హైదరాబాద్, ఏప్రిల్ 18:**రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రాంతీయ రాజకీయాలు ఇప్పుడు ఒకే రకమైన వారసత్వ యుద్ధం చుట్టూ తిరుగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నా.. అగ్రనేతల కుటుంబాల్లోని అన్నాచెల్లెళ్ల మధ్య తలెత్తిన విభేదాలు పార్టీల ఉనికిని, ఉమ్మడి ఓటు బ్యాంకును ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ , తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితి ఎదుర్కొంటున్న ఈ చిత్రమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యను పరిష్కారం చేసుకోవడం వారి వల్ల కావడం లేదు. తెలుగు రాజకీయాల్లో వైఎస్సార్, కేసీఆర్ కుటుంబాలకు ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అన్న వెన్నంటి నిలిచిన చెల్లెళ్లు, ఇప్పుడు అదే అన్నలకు రాజకీయంగా సవాల్ విసురుతున్నారు. ఏపీలో వైఎస్ జగన్ జైలులో ఉన్నప్పుడు షర్మిల పాదయాత్ర చేసి పార్టీని కాపాడితే, తెలంగాణలో ఉద్యమ సమయంలో కవిత సాంస్కృతిక సారథిగా నిలిచారు. అయితే, నేడు ఏపీలో జగన్-షర్మిల మధ్య ఆస్తుల గొడవలు, రాజకీయ విభేదాలు బహిరంగమై కోర్టుల వరకు వెళ్లగా.. తెలంగాణలో



కేటీఆర్-కవిత మధ్య ఆధిపత్య పోరు .. కవిత సొంత పార్టీ దిశగా వెళ్లింది. వైసీపీలో జగన్, షర్మిల మధ్య పోరు కేవలం రాజకీయమైంది మాత్రమే కాదు, కుటుంబ ఆస్తుల పంపకాల్లో తలెత్తిన విభేదాలు కూడా దీనికి ఆజ్య పోశాయి. తల్లి విజయమ్మ కూడా షర్మిల పక్షాన నిలబడటం పార్టీ కేడర్‌లో అయోమయాన్ని సృష్టించింది. అటు బీఆర్ఎస్‌లోనూ కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్న ప్రచారం జరిగిన -మిగతా5లో

## రేవంత్...
# నేషనల్ స్ట్రాటజిస్ట్..

**హైదరాబాద్, ఏప్రిల్ 18:**ఒకప్పుడు కాంగ్రెస్ అంటే ఢిల్లీ నుండి వచ్చే ఆదేశాల కోసం రాష్ట్ర నేతలు వేచి చూసే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చే సలహాలు, ఆయన రూపొందించే వ్యూహాలు ఇప్పుడు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కి దిక్సూచిగా మారుతున్నాయి. కేవలం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే వంటి అగ్రనేతలకు నమ్మకమైన 'నేషనల్ స్ట్రాటజిస్ట్'గా రేవంత్ రెడ్డి ఎదిగిన తీరు ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.రాజకీయాల్లో ప్రత్యర్థి వేసే ఎత్తుగడలకు ప్రతిస్పందించడం ఒక ఎత్తు అయితే, ప్రత్యర్థిని తన దారిలోకి తెచ్చుకోవడం మరో ఎత్తు. రేవంత్ రెడ్డి సరిగ్గా ఇదే చేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో "బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుంది" అనే నినాదాన్ని ఆయన క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లారు. ఈ ఒక్క వ్యూహం దేశవ్యాప్తంగా బీజేపీని ఆత్మరక్షణలో పడేసింది. రాజ్యాంగ రక్షణ, సామాజిక న్యాయం వంటి అంశాలను కాంగ్రెస్ ప్రధాన ఎజెండాగా మార్చడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, దూకుడుతో కూడిన ఎజెండాను సెట్ చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారు.నియోజకవర్గాల పునర్విభజన అంశం ప్రస్తుతం ఉత్తరాది -- దక్షిణాది రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతోంది. జనాభా



నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గుతాయన్న ఆందోళనలో రేవంత్ రెడ్డి ఒక 'హైబ్రిడ్ మోడల్'ను మిగతా5లో

## అడవిలో అక్రమంగా
# మట్టి తవ్వకాలు

### డోలోమైట్ రాయి వంటి విలువైన ఖనిజ సంపద మాయం
### వన్యప్రాణులకు ముప్పు- పర్యావరణానికి ప్రమాదం

**నిఘా టీం , అక్షర సవాల్ :**వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట శివారు టేకుల తండా సమీపంలోని పోచారం అటవీ ప్రాంతంలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి కొందరు అక్రమార్కులు మట్టి దందా ను సాగిస్తున్నారు. అధికారుల అండదండలతో కొందరు మట్టి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా తమ మట్టి దందాను సాగిస్తున్నట్లుగా సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో యంత్రాల సహాయంతో రాత్రి వేళల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికి సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహారిస్తున్నారని పలువురు



విమర్శిస్తున్నారు. అక్రమంగా మట్టి దోపిడీకే పరిమితం కాకుండా మట్టి దందా వల్ల పర్యావరణానికి ప్రమాదం



పొంచి ఉందని, వన్యప్రాణులకు తీవ్రమైన ప్రాణముప్పును కలిగిస్తున్నాయని పర్యావరణ మిగతా2లో

## సింహం బయటకు వస్తుంటే గుంటనక్కల
# గుండెల్లో దడ పుడుతోంది

### కేసీఆర్ సభకు వస్తున్నారని తెలిసి ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతోందని విమర్శ
### కేసీఆర్ జగిత్యాల వస్తున్నారనగానే రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనకు వెళుతున్నారని ఆగ్రహం
### కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్వుతున్నారని విమర్శ

సింహం బయటకు వస్తుందంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతుందని, అందుకే కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కుట్రలకు తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కేటీఆర్, హరీశ్ రావులు



కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ సభ పెడతానంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి చాలా సిల్లీ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ జగిత్యాల సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి మేడిగడ్డకు వెళుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో మేడిగడ్డ వెళ్లేందుకు ముఖ్యమంత్రికి సమయం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడ కేసీఆర్ కీలక బహిరంగ సభ జరుగుతుంటే టీవీలల్లో కేసీఆర్‌తో పాటు తన మేడిగడ్డ పర్యటన కూడా చూపించాలని, అలాగే పత్రికల్లో పతాక శీర్షికన కేసీఆర్‌తో పాటు తన వార్త రావాలనే చిల్లర ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. అలాగే జగిత్యాల వచ్చే రోడ్డు మూడేళ్లలో గుర్తుకు రాలేదు కానీ, ఇప్పుడు కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్విస్తున్నారని మండిపడ్డారు. కోరుట్ల నుంచి ఎవరూ రాకుండా తవ్విస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నో బహిరంగ సభలు జరిగాయని, ఇప్పుడు కూడా విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి హైట్ మాత్రమే చిన్నది కాదని మెదడు కూడా చిన్నదేనని ఎద్దేవా చేశారు. కాగా, ఎల్లుండి జగిత్యాలలో జరగనున్న బహిరంగ సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

## తెలంగాణ కు అన్యాయం జరిగితే
# చూస్తూ ఊరుకోం

### మంత్రి పొన్నం

**మహబూబ్ నగర్:**మహబూబ్ నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోమంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ,ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, వంశీ కృష్ణ తదితరులు మీడియా సమావేశం నిర్వహించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థలో నియంతృత్వానికి తావులేదని లోకసభ లో నిరూపితమైంది. ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చాలనే వారికి నిన్నటి బిల్లు వీగిపోవడం చెంపపెట్టు లాంటిది. 44 సంవత్సరాలుగా వాళ్ళ పార్టీకి ఒక్క బీజేపీ మహిళా అధ్యక్షురాలు లేదు. కాంగ్రెస్ పార్టీ పురుషులతో



సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించింది. రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ యాక్ట్. స్థానిక సంస్థలు ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ..మహబూబ్ నగర్ మేయర్ మహిళా అయింది అంటే కాంగ్రెస్ పార్టీ . రాజకీయ పరమైన నియంతృత్వం. డిలిమిటేషన్ ద్వారా దక్షిణ భారతదేశానికి అన్యాయం జరిగే విధంగా సీట్లు పెంచడంతో పాటు దానికి మహిళా బిల్లు జోడించడం అంటే వారికి చిత్తశుద్ధి లేదు. మా పార్టీ అధ్యక్షురాలు, ప్రధాని,రాష్ట్రపతి, లోకసభ స్పీకర్ ను మహిళలను చేసిన చరిత్ర కాంగ్రెస్ దని అన్నారు.ఇప్పటికే ఆమోదం పొందిన మహిళా బిల్లు వచ్చే ఎన్నికల్లో రిజర్వేషన్లు వచ్చేలా పెట్టండి. మహిళా బిల్లులో ఎస్సీ ఎస్టీ బీసీ సబ్ కోటా మిగతా2లో

## బీజేపీని ముంచేస్తున్న
# సొంత నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 18:**తెలంగాణ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదగాలని కలలు కంటున్న భారతీయ జనతా పార్టీకి ఇప్పుడు బయటి ప్రత్యర్థుల కంటే లోపలి శత్రువులే ఎక్కువయ్యారు. కొత్త రక్తాన్ని ఎక్కించుకుని పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన సమయంలో.. కొందరు నేతలు చేరికలకు బ్రేక్ వేస్తున్నారు. కొత్త వాళ్లు వస్తే తమ ఉనికికి ఎక్కడ ముంపు ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. దీంతో నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి.రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా రామచంద్రరావు పగ్గాలు చేపట్టినప్పటి నుండి పార్టీని ఒకతాటిపైకి -



మిగతా5లో

# సంపాదకీయం

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి తూట్లు...

మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ కొరకు ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు 161 కి తూట్లు పొడిచిన ఇండియా కూటమి.

మహిళల సాధికారతపై నిజమైన నిబద్ధత ఎవరిది?

మహిళల సాధికారత మరియు నియోజకవర్గాల పునర్విభజన భారత ప్రజాస్వామ్యానికి ఎంతో ముఖ్యమైన అంశం.

దేశంలో మహిళలకు 33% రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని ఈ దేశాన్ని ఈ దేశాన్ని 64 సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ పాలనలో బిల్లులు పెట్టి అమలు చేయక మహిళలను మోసం చేసింది.

ఎన్ని కారణాలు చెప్పినా చివరికి సాధించేది మహిళలకు 33 శాతం రిజర్వేషన్ మరియు ఢిలిమిటేషన్. ఈ బిల్లును ఆపడానికి అది కాదు, ఇది కాదు అని సాకులు చెప్పి, బిల్లును సమర్థించక కాంగ్రెస్ పార్టీ రాజకీయ చరిత్రలో అపకీర్తి తొ పాటు మరో మాయని మచ్చ మూట కట్టుకుంది.

సుదీర్ఘ చరిత్ర ఉందని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ తప్పులపై తప్పులు చేయడం వల్ల వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారంలో రాకుండా దారి తప్పింది ( ఎన్నికల్లో ఓడిపోయింది).

రాహుల్ గాంధీ లాంటి నాయకుడు ప్రతిపక్షంలో ఉన్నంతకాలం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదు, భారతీయ జనతా పార్టీకి డోకా లేదు.

1976లొ 42 రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా దక్షిణాది రాష్ట్రాలలో జనాభా, బీదరికం పెరుగుతుందని కుటుంబ నియంత్రణ పేరుతో దాదాపు 50 సంవత్సరాలుగా డిమిలిమిటేషన్ కి అడ్డుపడింది కాంగ్రెస్ పార్టీ కాదా?

1953లొ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని వెనుకబడిన తరగతుల వారి సర్వతో ముఖాభివృద్ధికి ఆర్టికల్ 340 ఆధారంగా కాకాకలేల్కర్ కమిషన్ నియమించింది, కానీ అమలు పరచ లేదు.

దక్షిణ రాష్ట్రాల పైన కానీ, మహిళల సాధికారతపై చిత్తశుద్ధి ఉంటే వారి సుదీర్ఘకాలం 64 సంవత్సరాల పాలనలో మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డిలిమిటెషన్ ఎందుకు జరగలేదు. కాంగ్రెస్ పాలనలో వీటిని అడ్డుకో వడానికి పెద్దగా ప్రతిపక్షాలు కూడ లేవు.

50 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న దేశ ప్రజల కోరిక, ఆశయం శ్రీ నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో నెరవేరితే, రాబోయే కాలంలో ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి రాలేమని అడ్డుపడడం దుర్మార్గం, దురదృష్టకరం.

పెరుగనున్న సీట్ల ఆధారంగా రాజకీయాల్లోకి ఏమ్మెల్యే , ఎంపీలుగా అవకాశం వస్తుందని ఆశించిన అనేక మందికి ఇండియా కూటమి తీరని అన్యాయం చేసింది. ముఖ్యంగా ఈ బిల్లును అడ్డుకొని మాతృమూర్తులను అవమా నించడమే.

మహిళలు వంటింటికే పరిమితం కావాలని భావించే వారి ద్వంద్వ వైఖరి ,పాత మనస్తత్వం, అసలు స్వరూపం ఇంకా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతుంది అనడానికి ఇది నిదర్శనం.



ఆచార్య అజ్మీర సీతారాం నాయక్
మాజీ లోకసభ సభ్యులు
మహబూబాబాద్

## మహిళా రిజర్వేషన్ బిల్లు
# నిజాయితీగా తీసుకురాలేదు

**: సీఎం రేవంత్..**



**హైదరాబాద్:** మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్ సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు రేవంత్. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని.. బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురదజల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాతథంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలోనే తేలుతుందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బిల్లును అడ్డుకోకుంటే డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేవారని ధ్వజమెత్తారు. నార్త్, సౌత్ మధ్య అంతరాలు పెట్టే విధానం ఇకనైనా మార్చుకోవాలని బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి హితవుపలికారు.

## రేవంత్ సభను విజయవంతం చేయాలి: శ్రీధర్ బాబు

**సోమవారం కాటారంలో సీఎం రేవంత్ కార్యక్రమం**
**మంథని క్యాంప్ కార్యాలయంలో శ్రీధర్ బాబు సమీక్ష సమావేశం**
**కార్యక్రమంలో పాల్గొననున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' నిధుల విడుదల కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయవంతం చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మంథనిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి మండలాల కాంగ్రెస్ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం కాటారంలో జరగనున్న ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, ఆయనతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, దానికి రైతు భరోసా పథకమే నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చేలా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా బాధ్యతలను కేటాయించిన ఆయన, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను, పార్టీ శ్రేణులను కోరారు. కాటారం సభ ద్వారా రైతులకు భరోసా కల్పించడమే కాకుండా, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చాటి చెప్పబోతున్నామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## సీనియర్ నేత జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో
# బీఆర్ఎస్ కు మరింత బలం...

**రేవంత్ పోవాలి..కేసీఆర్ రావాలి..రాష్ట్ర వ్యాప్తంగా ఇదే నినాదం మార్మోగుతున్నది.**
**జగిత్యాల మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు**



**జగిత్యాల:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు జగిత్యాలలో పర్యటించారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి ఈ నెల 20న కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరనున్న నేపథ్యంలో, ఆ సభ ఏర్పాట్లను వారు పరిశీలించారు.తరువాత జగిత్యాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు గారు మాట్లాడుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రాజకీయాల్లో ఎంతో విలువలతో కూడిన నాయకుడు పెద్దలు జీవన్ రెడ్డి ఈ నెల 20వ తేదీన కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. ఆయన చేరిక కరీంనగర్ జిల్లాకే కాదు, యావత్ ఉత్తర తెలంగాణకు, బీఆర్ఎస్ పార్టీకి ఎంతో బలాన్ని ఇస్తుంది.రాష్ట్రంలో ప్రజలకు ఒక స్పష్టమైన క్లారిటీ వచ్చేసింది.. 'రేవంత్ రెడ్డి పోవాలి, కేసీఆర్ రావాలి' అని ప్రజలు బలంగా కోరుకుంటున్నారు అనడానికి జీవన్ రెడ్డి చేరిక ఒక సజీవ సాక్ష్యంఅని అన్నారు.నిన్న పార్లమెంటులో జరిగిన రెండు పరిణామాలు తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా కలచివేశాయి. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును ఇండియా పాకిస్తాన్ విభజనతో పోల్చడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీయడమే. బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సింది పోయి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆ వ్యాఖ్యలను వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేయడం అత్యంత దుర్మార్గం. తేజస్వి సూర్య మాట్లాడిన మాటలు చూస్తుంటే తెలంగాణ ప్రజల గుండెలు రగిలిపోతున్నాయి. కేసీఆర్ నాయకత్వంలో సకల జనులు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కించపరుస్తారా?. - మిగతా5లో

## తెలంగాణ కు అన్యాయం జరిగితే
# చూస్తూ ఊరుకోం

- మొదటి పేజీ తరువాయి

ఉండాలని కాంగ్రెస్ పార్టీ స్టాండ్. సంఖ్యా బలం ఉందని ఇష్టారీతిన వ్యవహరించారు ప్రజాస్వామ్యాన్ని కాలరాసే విధంగా చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించడం వల్లే బిల్లు వీగిపోయింది..హ్యాట్సాఫ్ ఇండియా కూటమి ఎంపీలకు 2/3 శాతంలో 54 ఓట్లు తక్కువ వచ్చాయి. మహిళలకు సంబంధించి మొసలి కన్నీరు కారుస్తూ డిలిమిటేషన్ తో లేకగడుతూ ఇండివిజువల్ కాకుండా బిల్లు పెట్టారు ప్రజాస్వామ్యాన్ని నిరంకుశత్వంగా కూని చేశారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకీ కట్టుబడి ఉందని అన్నారు.మహిళా సాధికారతగా వెళ్తున్న తెలంగాణ మహిళలు బీజేపీ కుట్రలు తిప్పికొట్టాలి. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష దశాబ్దాలుగా ఉంది. విద్యార్థులు,యువకులు అమరులైతే ఆనాడు పార్లమెంట్ సభ్యుడిగా కొట్లాడి ఆర్టికల్ 3 ద్వారా లోకసభ,రాజ్యసభ లో ఆమోదం పొంది ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. బీజేపీ ఎంపీ దుర్మార్గుడు తెలంగాణ విభజన ను భారత్ పాకిస్థాన్ విభజన తో పోల్చి అవమానపరిచే విధంగా మాట్లాడారు. అదే సభలో ఉన్న తెలంగాణ బీజేపీ ఎంపీలకు చీము నెత్తురు లేదా అని నిలదీసారు.బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు,కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కాకినాడ తీర్మానం లో ఒక ఓటు రెండు రాష్ట్రాలు అన్నది ఎవరు. మీ వల్లే తెలంగాణ ఆలస్యం అయింది. మాంధ్రులు తెలంగాణ విభజన ను వ్యతిరేకించిన స్వయంగా అద్వానీ తో చర్చించి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పరిచారు. తెలంగాణ రాష్ట్ర కోసం రాజీనామా చేయమని అంటే పారిపోయిన వ్యక్తి కిషన్ రెడ్డి తేజస్వి సూర్య తప్పుయింది అని ఒప్పుకున్నారు అని అంటున్నారు. తేజస్వి మాటలు రికార్డుల నుండి తొలగించకపోతే కిషన్ రెడ్డి,బండి సంజయ్,స్థానిక ఎంపీ డీకే అరుణ మీరు తెలంగాణ ద్రోహులుగా మిగులుతారు. ఇది రాజకీయం కాదు తెలంగాణ ఆత్మగౌరవం తెలంగాణ కోసం కాళ్లు మొక్కినొల్లం..పార్లమెంట్ లో కొట్లాడినోల్లాం తెలంగాణ కు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం డిలిమిటేషన్ పై ఆల్ పార్టీ మీటింగ్ పెట్టి మీ ఆలోచనలు చెప్పి సలహాలు సూచనలు అడిగారా, బిల్లు వీగిపోయిన బతికున్న చచ్చిపోయిన శవం లాగ. బీజేపీ కేంద్ర ప్రభుత్వం డిలిమిటెషన్ కి మహిళా బిల్లు కలిపి పెట్టొద్దు. రాహుల్ గాంధీ నాయకత్వంలో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు అవుతుందని అన్నారు.

# అడవిలో అక్రమంగా మట్టి తవ్వకాలు

- మొదటి పేజీ తరువాయి

వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించాల్సిన ప్రాంతాలలో ఈ యంత్రాల శబ్దం వాటి జీవనస్థితిగతుల భయభ్రాంతులకు గురిచేస్తోంది. దీంతో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని పలువురు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఒకవైపు పాకాల అభయారణ్యంలో వన్యప్రాణుల మనుగడ కోసం అధికారులు అనేక చర్యలు చేపడుతుంటే, మరోవైపు కొందరు అక్రమార్కులు సాగిస్తున్న ఈ మట్టి తవ్వకాల వల్ల లక్ష్యానికి గండి పడుతోంది.మట్టి తవ్వకాల కోసం అటవీ ప్రాంతంలో అడ్డు వచ్చిన విలువైన చెట్లను తొలగిస్తూ, మట్టిలో అపారమైన డోలోమైట్ రాయి వంటి విలువైన ఖనిజ సంపదను అక్రమంగా తరలిస్తూ సంపదను పోగేసుకుంటున్నారు. ఈ చర్యలు అడవిలోని సహజ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. యంత్రాల శబ్దాలకు అడవిలో ఉండాల్సిన వన్యప్రాణులు జనావాసాల వైపు వస్తున్నాయని, దీంతో అవి వేటకు గురయ్యే, భవిష్యత్తులో కొన్ని ప్రాణులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు ఈ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పాకాల అటవీ ప్రాంతాన్ని కాపాడాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలు కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా మొత్తం పర్యావరణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తక్షణమే ఈ అక్రమ మట్టి దందాను అరికట్టి, అటవీ సంపదను, వన్యప్రాణులను రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రైతుల కన్నీళ్లు - అధికారుల నిర్లక్ష్యం

# నెక్కొండలో మక్కజొన్న సంక్షోభం తీవ్రం



**నెక్కొండ, ఏప్రిల్ 18 అక్షర సవాల్:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో మొక్కజొన్న కొనుగోలు విషయంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మెంబర్,మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు.తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు రైతులు తీసుకువచ్చిన మొక్కజొన్నను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో సుమారు 80 వేల బస్తాలు పేరుకుపోయాయని,కిలోమీటర్ల మేర ట్రాక్టర్లలో మొక్కజొన్నతో రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తున్నారని తెలిపారు.ప్రతిరోజూ రైతులు ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం,తగిన సదుపాయాల లేమి, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అకాల వర్షాలు పడితే మొక్కజొన్న తడిసిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బ ప్రమాదం ఉన్నందున మార్కెట్ యార్డులో తాగునీరు, నీడ వంటి ప్రాథమిక సౌకర్యాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల నుంచి రక్షణకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని,గన్నీ బ్యాగులు సరఫరా చేయాలని కోరారు.లేదంటే ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు బాధ్యత వహించాల్సి ఉంటుందని రైతులు హెచ్చరిస్తున్నారని తెలిపారు.మద్దతు ధరకు కొనుగోలు జరగకపోవడంతో రైతులు నష్టపోతున్నారని,నిల్వలు పెరగడంతో తక్కువ ధరలకు ప్రైవేటు వ్యాపారులకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరి, పత్తి దిగుబడులు తగ్గడంతో మక్కజొన్నపై ఆశలు పెట్టుకున్న రైతులకు తీవ్ర నిరాశ ఎదురవుతోందని అన్నారు.రెడ్లవాడ,దీక్షకుంట్ల,సూరిపల్లి,అలంకానిపేట,చంద్రుగొండ ప్రాంతాల్లో అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే సమస్యలు తగ్గుతాయని సూచించారు. మార్కెట్ వ్యవహారాలపై అవగాహన ఉన్న సీఈఓను బదిలీ చేయడం వల్ల పరిస్థితి మరింత విషమించిందని,వెంటనే అనుభవం ఉన్న అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు న్యాయం చేయాలని గటిక అజయ్ కుమార్ కోరారు. కొనుగోలు ఆలస్యం కొనసాగితే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కొమ్మాల సంతలో ఉచిత మజ్జిగ పంపిణీ...

**2,000 మందికి చల్లని ఉపశమనం**



**గీసుగొండ, ఏప్రిల్ 18 । అక్షర సవాల్:** ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వేళ దాహంతో అలమటిస్తున్న ప్రజలకు చల్లని ఉపశమనం అందిస్తూ అల్లం బాల కిషోర్ రెడ్డి ఫౌండేషన్ ముందుకొచ్చింది. కొమ్మాల అంగడి ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత శీతల మజ్జిగ పంపిణీ కార్యక్రమం విశేష స్పందన పొందింది. అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి ఆలోచనతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమం సామాన్య ప్రజల హృదయాలను తాకింది. రైతులు, పశువుల వ్యాపారులు, ప్రయాణికులు కలిపి దాదాపు 2,000 మందికి పైగా మజ్జిగ పంపిణీ చేసి ఎండ తీవ్రత నుంచి తక్షణ ఉపశమనం కల్పించారు. జిల్లా నాయకులు, గీసుగొండ సర్పంచ్ వీరగోని రాజ్ కుమార్, అల్లం మర్రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి, స్వయంగా మజ్జిగ పంపిణీ చేయడం ద్వారా ప్రజలతో కలిసిమెలిసి సేవ చేయాలనే తమ నిబద్ధతను చాటారు. కార్యక్రమంలో కొమ్మాల సర్పంచ్ కన్నెబోయిన యమునా ప్రవీణ్, దస్రుతండ సర్పంచ్ కేలోతు అమృత బిక్షపతి, సూర్య తండా సర్పంచ్ బాణోతు రాఘవేంద్రతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు పార్టీలకు అతీతంగా ఈ సేవకు మద్దతు తెలపడం విశేషంగా నిలిచింది. వచ్చే వారంలో మరింత విస్తృతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి శనివారం ఉచిత మజ్జిగ పంపిణీ కొనసాగుతుందని వెల్లడించారు. ఎండల తీవ్రత మధ్య ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే ఈ సేవా కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు ప్రశంసిస్తున్నారు.

## జనగణన-2027కు శంఖారావం...

**గీసుగొండలో ఘనంగా శిక్షణ ప్రారంభం**




**గీసుగొండ, ఏప్రిల్ 18 । అక్షర సవాల్:** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జనగణన--2027 మొదటి దశ (గృహ గణన) పనులకు గీసుగొండ మండలంలో శిక్షణ కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ధర్మారం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ శిక్షణకు శ్రీకారం చుట్టారు. మొదటి దశ గృహ గణన నిర్వహణ కోసం మండలంలో మొత్తం 56 మంది ఎన్యూమరేటర్లు, 10 మంది సూపర్వైజర్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించారు. వీరిని రెండు బ్యాచ్లుగా విభజించి, మొదటి బ్యాచ్‌కు ఏప్రిల్ 18, 20, 21 తేదీలలో, రెండవ బ్యాచ్‌కు 23, 24, 25 తేదీలలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గీసుగొండ తహసీల్దార్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించగా, గీసుగొండ మరియు ఖిలా వరంగల్ మండలాలకు చెందిన 38 మంది ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ఇద్దరు ఫీల్డ్ ట్రైనర్లు ప్రాథమిక అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి, ఖిలా వరంగల్ తహసీల్దార్, గీసుగొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి హాజరై, జనగణన ప్రక్రియను కచ్చితంగా నిర్వహించాలని సూచించారు.

## అధిక యూరియా వద్దు...

# సమతుల్య ఎరువులే ముద్దు!

**శాస్త్రీయ సాగుతోనే గిట్టుబాటు -- దస్రుతండాలో ఏరువాక అవగాహన కార్యక్రమం**





**గీసుగొండ, ఏప్రిల్ 18 । అక్షర సవాల్:** రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే సంప్రదాయ పద్ధతులను వదిలి శాస్త్రీయ సాగు వైపు మళ్లాలని వ్యవసాయ అధికారులు సూచించారు. గీసుగొండ మండలంలోని దస్రుతండాలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన ఏరువాక సాగుబడి అవగాహన కార్యక్రమం రైతులకు మార్గదర్శకంగా నిలిచింది. గ్రామ సర్పంచ్ కేలోతు అమృత బిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొని రైతులకు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు మాట్లాడుతూ కేవలం యూరియాపైనే ఆధారపడటం వల్ల నేల సారాన్ని కోల్పోతుందని, భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువులను వినియోగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. నానో ఎరువుల వాడకం వల్ల పెట్టుబడి తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుందని, భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్ వంటి జీవ శిలీంద్రనాశనాల వినియోగం ద్వారా పంటలు సహజంగా తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పొందుతాయని వివరించారు. అదేవిధంగా సంవత్సరాలుగా విచక్షణారహితంగా వాడుతున్న రసాయన ఎరువుల కారణంగా నేలలో పేరుకుపోయిన భాస్వరాన్ని తిరిగి మొక్కలకు అందించడంలో ్రూాదీ వంటి జీవ ఎరువులు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. వీటి వాడకం వల్ల భూమి స్వభావం మారి పంటలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఉద్యాన విస్తరణ అధికారి బి. వేణు కుమార్ మాట్లాడుతూ ఆయిల్ పామ్, కూరగాయల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూనియర్ వెటర్నరీ అధికారి సుమన్ జిత్ర పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించడం తప్పనిసరి అని, పశుగ్రాస విత్తనాలు పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా నేషనల్ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత కూరగాయల విత్తన కిట్లను సర్పంచ్ చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె. రజిని, గ్రామ కార్యదర్శి లావణ్య, కేలోతు భిక్షపతి, నునావత్ వీరన్నతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు. రైతులకు ఉపయోగపడే ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని సర్పంచ్ తెలిపారు.

## నెక్కొండ వారాంతపు సంత అభివృద్ధి పనులకు శ్రీకారం



**నెక్కొండ,ఏప్రిల్ 18 అక్షర సవాల్:** వరంగల్ జిల్లా నెక్కొండ గ్రామంలోని వారాంతపు సంత అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంత ప్రాంగణంలో జంగిల్ క్లియరెన్స్,అంతర్గత రహదారులు,గ్రౌండ్ లెవెలింగ్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ మాట్లాడుతూ,అనేక సంవత్సరాలుగా సమస్యలతో నిలిచిపోయిన సంతను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి,అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.సంతను రైతులు,వ్యాపారులకు అనుకూలంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లావుడియా తిరుమల్,జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయి కృష్ణ,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజేటి బిక్షపతి,రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,నాయకులు చల్లా రఘోతంరెడ్డి,ఉప సర్పంచ్ సింగం శ్రావణి ప్రశాంత్,గ్రామ కార్యదర్శి దయ్యాల సదానందం,వార్డు సభ్యులు మహమ్మద్ అమీర్,యాట శ్రావని వినీత్,భూక్య రవి,చల్ల విష్ణు,దేవన బోయిన విజేందర్,కందిక ఉమా వెంకన్న,మార్కెట్ డైరెక్టర్ బొమ్మెర బోయిన రమేష్ యాదవ్,నాయకులు పోరండ్ల శ్రీనివాస్,నాదెండ్ల ప్రసాద్,పాష తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ గ్రామం నుంచి జాతీయ మోడల్...

**గంగదేవిపల్లి పాఠం నేర్చుకున్న పేదవీడు బృందం**





**గీసుగొండ, ఏప్రిల్ 18 । అక్షర సవాల్:** ఆదర్శ గ్రామం ఎలా ఉండాలో ప్రత్యక్షంగా చూపించిన గంగదేవిపల్లి... అభివృద్ధి రహస్యాలను తెలుసుకోవడానికి పేదవీడు బృందం అడుగులు వేసింది. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం పెదవీడు గ్రామ పంచాయతీ పాలకవర్గం, జాతీయ స్థాయి ఆదర్శ గ్రామంగా పేరొందిన గంగదేవిపల్లి ను సందర్శించి అభివృద్ధి విధానాలను లోతుగా అధ్యయనం చేసింది. సర్పంచ్ ఎ. వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఉపసర్పంచ్ ఎం. త్రివేణి, పంచాయతీ కార్యదర్శి వై. ప్రవీణ్ కుమార్‌తో పాటు సభ్యులు గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలను సమగ్రంగా పరిశీలించారు. సందర్శనలో భాగంగా, ఒక సాధారణ గ్రామం నుంచి జాతీయ స్థాయిలో ఆదర్శ గ్రామంగా గంగదేవిపల్లి ఎలా ఎదిగిందో అక్కడి ప్రతినిధులు వివరించారు. ముఖ్యంగా గ్రామ కమిటీల సమన్వయం, ప్రజల భాగస్వామ్యం, నీటి వనరుల సంరక్షణ, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలు పేదవీడు బృందాన్ని ఆకట్టుకున్నాయి. ప్రజల ఐక్యత, క్రమశిక్షణ, బాధ్యతాయుత వ్యవహారం వల్లే ఈ స్థాయి అభివృద్ధి సాధ్యమైందని సందర్శకులు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కూసం స్వరూప--రమేష్ మాట్లాడుతూ, "ప్రజల భాగస్వామ్యమే మా విజయానికి మూలం... అందరం కలిసికట్టుగా పనిచేయడం వల్లే గంగదేవిపల్లి ఈ స్థాయికి చేరుకుంది" అని తెలిపారు. కరోబార్ చెంచు రాజు, గ్రామ పెద్దలు కూసం లింగయ్య, గోనె రాజయ్య తదితరులు అభివృద్ధి మార్గాలను వివరించారు. "అభివృద్ధి అంటే కేవలం పనులు కాదు... ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన మార్పు" అనే సందేశాన్ని గంగదేవిపల్లి మరోసారి స్పష్టంగా చాటిచెప్పింది.

## సీబీఎస్ ఈ ఫలితాలలో

# నునావత్ ఈశ్వర్ నాయక్...


**449 మార్కులు తో విజయ డంకా..**




**హనుమకొండ ఏప్రిల్ 18 అక్షర సవాల్ :** గుండ్ల సింగారం నివాసి నునావత్ రాజన్న కుమారుడు ఈశ్వర్ నాయక్ విద్యార్థి ఏకచత్రాధిపత్యం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ లో పదవ తరగతి ఫలితాల్లో మిలీనియం స్కూల్ లో నూనావత్ రాజన్న కుమారుడు ఈశ్వర్ నాయక్ చక్కటి ప్రతిభ చూపి అత్యున్నత మార్కులు 449 సాధించారు. ఈ ఫలితాలు ప్రకటించిన అనంతరం రెండోవ డివిజన్ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్, లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, మానస రవి, వసంత వెంకట్, వనిత రవినాథ్, మౌనిక మురళి మరియు కుటుంబ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ మాట్లాడుతూ మీ పిల్లల బంగారు భవిష్యత్తుకై పెట్టుకున్నటువంటి ఆశలు నెరవేర్చడంలో మా సహకారం ఎల్లవేళలా కృషి చేస్తాయని తెలిపారు. కేవలం పాఠ్య పుస్తకాల్లోని అంశాలని బోధించడమే కాకుండా విద్యార్థులు స్వయం సృజనాత్మక శక్తిని పెంపొందించుకొని పాఠ్యేతర అంశాలపై కూడా పట్టు సాధించినప్పుడే విజయం సాధ్యమవుతుందని తెలిపారు. చక్కని ప్రతిభ చూపిన విద్యరిని విద్యార్థులు భవిష్యతులో కూడా రాణించి ఉన్నత స్థాయిలో ఉండలిని ఆకాంక్షించారు. మీ తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని పై చదువుల్లో స్టేట్ ర్యాంకులు సాధించాలని డాక్టర్లు ఇంజనీర్లుగా ముందంజలో ఉండాలని కోరుకుంటూ మా బంజారా ముద్దుబిడ్డ గుండ్ల సింగారం నివాసి అయిన నునావత్ రాజన్న కుమారుడు ఈశ్వర్ నాయక్ కు శుభాకాంక్షలు తెలిపి అభినందించిన గ్రామ ప్రజలు బంధుమిత్రులు.

## ప్రాణ పోరాటంలో 'ఆపన్నహస్తం'...

**ఆటోడ్రైవర్‌కు అండగా లక్ష్మీనారాయణ**



**గీసుకొండ, ఏప్రిల్ 18 । అక్షర సవాల్:** ఓపెన్ హార్ట్ సర్జరీ తర్వాత జీవన పోరాటంలో ఉన్న నిరుపేద ఆటోడ్రైవర్‌కు గ్రామ పెద్ద మానవత్వం చూపించారు. గీసుకొండ మండల కేంద్రానికి చెందిన షేక్ అంకూస్ పాషా (షరీఫ్) ఇటీవల హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయన దయనీయ పరిస్థితిని గుర్తించిన అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్, గ్రామ శ్రీమంతుడు పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ ముందుకు వచ్చి రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ నగదును గీసుకొండ సోషల్ సర్వీస్ టీం ప్రతినిధులు కర్ణకంటి రాంమూర్తి, ముల్క సత్యనారాయణ, మహ్మద్ సోనీ, కత్తి వెంకటేశ్వర్లు, బోడకుంట ప్రభాకర్ కలిసి బాధితునికి అందజేశారు. ఈ సహాయంపై భావోద్వేగానికి గురైన అంకూస్ పాషా, ఆపద సమయంలో తనకు అండగా నిలిచిన లక్ష్మీనారాయణకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో అండగా నిలిచిన మానవత్వం... గ్రామంలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ప్రైవేట్ స్కూల్‌కు రైతుబంధు అంటూ వైరల్... నిజం ఇదే!

**సోషల్ మీడియాలో దుమారం**

**అధికారుల క్లారిటీతో ముగిసిన వివాదం**

**గీసుగొండ, ఏప్రిల్ 18 । అక్షర సవాల్:** వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ధర్మారం గ్రామాన్ని కుదిపేసిన "ప్రైవేట్ పాఠశాలకు రైతుబంధు" అనే సోషల్ మీడియా ప్రచారం చివరకు తప్పుడు వార్తగా తేలింది. ప్రజల్లో కలకలం రేపిన ఈ వైరల్ కథనంపై అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చి అపోహలకు తెరదించారు. ధర్మారం గ్రామంలోని ఏవీఎస్ లిటిల్ గేమ్స్ పబ్లిక్ స్కూల్ ఉన్న సర్వే నెం. 416/1 భూమి మొత్తం 1 ఎకరం 36 గుంటల విస్తీర్ణంలో ఉంది. ఈ భూమి అంకతి సాగర్ పేరిట ఉన్నప్పటికీ, అది వ్యవసాయ భూమి కాదని అధికారులు తేల్చారు. ఇప్పటికే ఆన్‌లైన్ రికార్డుల్లో "నాన్-అగ్రికల్చర్ యూజ్"గా నమోదు చేయబడిన ఈ భూమిని "స్టాప్ పేమెంట్" కింద ఉంచారు. దీంతో ఆ భూమికి రైతుబంధు లేదా రైతు భరోసా పథకాల లబ్ధి ఎప్పుడూ అందలేదని తహశీల్దారు స్పష్టం చేశారు. ఇక పాఠశాల పక్కనే ఉన్న సర్వే నెం. 416/1/ఎ లోని 1 ఎకరం వ్యవసాయ భూమి మాత్రం అంకతి వివేక్ సాగర్ పేరిట ఉండటంతో, ఆ భూమికే ప్రభుత్వ పథకాల ప్రయోజనం వర్తిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, పాఠశాల భూమికి సంబంధించి నాన్-అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్ (చీూూూ) ప్రక్రియ పూర్తి చేయాల్సిందిగా యజమానికి నోటీసులు జారీ చేయనున్నట్లు తహశీల్దారు తెలిపారు. మొత్తానికి, సోషల్ మీడియాలో వైరల్ అయిన ప్రచారం పూర్తిగా తప్పుదారి పట్టించేదేనని అధికారులు తేల్చి చెప్పారు.

# కాంగ్రెస్ మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆత్మకూర్ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉడుత సంగీత-మహేందర్



**అక్షర సవాల్// ఆత్మకూర్:** శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ భవన్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ సమావేశానికి విచ్చేసిన రాష్ట మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాన్ల ఝాన్సీ రెడ్డి ని వారి ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించిన మాజీ సర్పంచ్ అత్మకూర్ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉడుత సంగీత-మహేందర్ మహిళా నాయకురాలు నీలం విజయ రాజు కలిసి మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు అనంతరం ఉడత సంగీత మాట్లాడుతూ మండలం లో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడం,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి మహిళా మద్దతును సమీకరించడం జరుగుతుంది అని అన్నారు,రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎర్రబెల్లి స్వర్ణ నేతృత్వంలో గడప గడపకూ తీసుకువెళ్తామని అన్నారు.

# స్నేహబంధం చూపిన మానవత్వం...

**క్యాన్సర్‌తో మృతిచెందిన పైడిరాజు కుటుంబానికి అండగా ఊరి యువత!**



**ఆత్మకూర్, ఏప్రిల్ 18 । అక్షర సవాల్:** కష్టకాలంలో తోడుగా నిలవడం నిజమైన స్నేహానికి నిదర్శనం. ఆత్మకూర్ ప్రాంతానికి చెందిన పైడిరాజు క్యాన్సర్ వ్యాధితో మృతిచెందగా, ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న ఊరి స్నేహితులు, యువకులు కలిసి మానవత్వాన్ని చాటుతూ కుటుంబానికి అండగా నిలిచారు. మిత్రబృందం ముందడుగు వేసి గ్రామంలో విరాళాలు సేకరించి మొత్తం ?22,500 ఆర్థిక సహాయాన్ని పైడిరాజు కుటుంబానికి అందజేశారు. ఈ సహాయ కార్యక్రమంలో గుండెబోయిన శ్యాము కీలక పాత్ర పోషించి, డబ్బులు సేకరించడంలో ముందుండి నడిపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుటుంబ సభ్యులు యువత చూపిన సహాయస్ఫూర్తిని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కష్టసమయంలో ఇలాంటి సాయం ఎంతో ధైర్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.

# థాయ్ ల్యాండ్ మాస్టర్ కార్డ్ ప్రకటించిన కంట్రీ క్లబ్

కంట్రీ క్లబ్ తమ ప్రత్యేక "థాయిలాండ్ మాస్టర్ కార్డ్"ను ప్రకటించింది. ఈ ప్రీమియం మెంబర్‌షిప్ ద్వారా థాయిలాండ్లోని ప్రముఖ పర్యాటక నగరాలైన బ్యాంకాక్, పట్టాయా, ఫుకెట్లకు సులభంగా, ప్రణాళికాబద్ధంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ కార్డ్ను బేగంపేట్లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.రాజీవ్ రెడ్డి థాయిలాండ్ మాస్టర్ కార్డ్ ను ఆవిష్కరించారు. ఈ సంర్భంగా ఫుకెట్ థీమ్తో నిర్వహించిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అందాల ముద్దుగుమ్మలు ఇండో-వెస్ట్రన్, వేర్ కలెక్షన్స్ లో వయ్యారాల నడకలతో హొయలొలికించారు. ఈ సందర్భగా మీడియాతో రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ పర్యటన మరింత సులభంగా ఉండేందుకు. ఫ్రాంచైజీ ఆధారిత విస్తరణ వ్యూహం ద్వారా సభ్యులకు సులభమైన ప్రయాణం, దీర్ఘకాలిక విలువను అందించడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. తమ క్లబ్ . ఇప్పటికే బ్యాంకాక్, పట్టాయాలో భాగస్వామ్యంతో విస్తరణ పెంచుకున్నదన్నారు. ఇప్పుడు ఫుకెట్ను చేర్చడం ద్వారా సభ్యులకు లగ్జరీ, అడ్వెంచర్, హాస్పిటాలిటీ కలగలిపిన సమగ్ర అనుభవాన్ని అందించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం పర్యాటక రంగం ప్రపంచ ఆర్థిక వృద్ధి, సాంస్కృతిక మార్పిడి, జీవనశైలి అభివృద్ధికి కీలకంగా మారిందని ఆయన పేర్కొన్నారు. భారతదేశం వేగంగా పెరుగుతున్న అవుట్బౌండ్ ట్రావెల్ మార్కెట్గా ఎదుగుతున్న నేపథ్యంలో, ఆధునిక భారతీయ ప్రయాణికులు ప్రీమియం అయినప్పటికీ విలువైన అంతర్జాతీయ అనుభవాలను కోరుకుంటున్నారని తెలిపారు.

# ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన మాజీ మంత్రి తిలావత్

**సెలబ్రిటీ డిజైనర్ రుడావత్ వర్షా నాయక్ ఆధ్వర్యంలో ఆర్‌విఎన్ ఎగ్జిబిషన్...**





**నిజాంపేట్, ఏప్రిల్ 18 అక్షర సవాల్ :** సెలబ్రిటీ డిజైనర్ రుడావత్ వర్షా నాయక్ ఆధ్వర్యంలో ఆర్‌విఎన్ ఎగ్జిబిషన్ థర్డ్ సీజన్ నిజాంపేట్‌లోని కోలన్ రాఘవరెడ్డి గార్డెన్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జాతీయ గౌరవాధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు బంజారా భీష్మ అమర్ సింగ్ తిలావత్ హాజరై, తమ చేతుల మీదుగా ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తిలావత్ మాట్లాడుతూ, మహిళలను వ్యాపార రంగంలో ప్రోత్సహించడానికి ఇలాంటి ఎగ్జిబిషన్‌లు ఎంతో దోహదపడతాయని తెలిపారు. బంజారా సమాజానికి చెందిన ఒక మహిళ సెలబ్రిటీ డిజైనర్‌గా ఎదగడం గర్వకారణమని, అదే సమయంలో ఇతర మహిళలకు అవకాశాలు కల్పించడానికి వర్షా నాయక్ చేపడుతున్న ఈ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా వర్షా నాయక్‌ను ఆదర్శంగా తీసుకుని బంజారా సమాజంలోని యువత ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర మీడియా సెక్రటరీ తేజావత్ భీముడు నాయక్, జాతీయ యువ నాయకుడు వెంకట్ తిలావత్, ప్రముఖ టీవీ సీరియల్ నటీనటులు మరియు యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్లు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసిన వ్యాపారులు మాట్లాడుతూ, కార్యక్రమం చాలా సమర్థవంతంగా నిర్వహించారని, భవిష్యత్తులో కూడా ఆర్‌విఎన్ ఎగ్జిబిషన్‌ను మరింత విస్తృత స్థాయిలో నిర్వహించాలని ఆకాంక్షించారు.

# గూడూరు నియోజకవర్గం సాధనకై ఉద్యమిస్తాం..

**23న "చలో గూడూరు" కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..**






**గూడూరు, అక్షర సవాల్ :** గూడూరు మండలాన్ని ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న గూడూరు అంగడి సెంటర్‌లో నిర్వహించనున్న యువజన జేఏసీ భారీ సమావేశాన్ని విజయవంతం చేయాలని యువజన జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం గూడూరు మండల కేంద్రంలోని అంగడి ఆవరణలో నిర్వహించిన యువజన జాయింట్ యాక్షన్ కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య సలహాదారులు పెదకాసు కుమారస్వామి, వాంకుడోత్ కటర్ సింగ్, కాయితోజు దేవేంద్ర చారి మాట్లాడుతూ --- నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కొత్తగూడ, గంగారాం, కేసముద్రం, గూడూరు మండలాలను కలిపి గూడూరు నియోజకవర్గంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ లక్ష్య సాధన కోసం పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై పోరాటానికి సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు . ఈ నేపథ్యంలో ఈ నెల 23న గూడూరు మండల కేంద్రంలో జరిగే "చలో గూడూరు" కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి వివిధ కుల సంఘాలు, యువజన, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గూడూరు మండలంలోని అన్ని గ్రామాల నుంచి యువకులు, విద్యావంతులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలల నివాళులర్పించారు. అనంతరం యువజన జేఏసీ స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు.

**ముఖ్య సలహాదారులుగా..**

పెదకాసు కుమార స్వామి, వంకుడోత్ కటర్ సింగ్, కాయితోజు దేవేంద్ర చారి, కొట్టెం ముఖర్జీ, దారావత్ కిషన్, నామని సదానందం, అక్కినపల్లి సదయ్య లు యువజన జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులుగా బానోత్ రామన్న నాయక్, భూక్యా సురేష్ నాయక్, ఎండీ రహీం పాషా పెసరి శివ, పొడిశెట్టి సురేష్,భాషిపాక నవీన్ చీదురు హరీష్ బానోత్ విజయ్ కుమార్ నూకల అశోక్, జల్లి యాకయ్య, మాలోత్ రాజారాం, ముదురు బిక్షపతిమండల కుమార్, పాపని రమేష్ పుట్ట ఐలయ్య, భూపతి శ్రీనివాస్ దోమ రాము, దారా రఘు, బందెల అనిల్, తదితరులను ఎన్నుకున్నారు.

# హనుమాన్ అర్ధమండల దీక్ష ప్రారంభం

**- వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు**

**- రామనామంతో విజయం సిద్ధిస్తుంది**





**మంగపేట, ఏప్రిల్ 18, అక్షర సవాల్:** మండలంలోని కమలాపురం గ్రామంలో ఉన్నటువంటి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం శ్రీ రామ బంటు హనుమంతునికి శనివారం అత్యంత ప్రీతికరమైన రోజు ఆలయ ప్రధాన అర్చకులు ప్రతాపరం వంశీ కుమారచార్యులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. సుమారు 30 మంది హనుమాన్ భక్తులకు హనుమాన్ మాల ధారణ చేసి అర్ధమండల దీక్షను ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ హనుమాన్ దీక్ష చేపట్టిన భక్తులు చేసే ప్రతి పనిని రామనామంతో మొదలు పెడితే విజయం తప్పక సిద్ధిస్తుందని అన్నారు. ఆలయ ప్రాంగణం " శ్రీరామ జయ రామ జయ జయ రామ" "శ్రీ హనుమ జయ హనుమ జయ జయ హనుమ" నామాలతో మార్మోగింది.

## మాంటిస్సోరి హై స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్ సందడి




**నెక్కొండ, ఏప్రిల్ 18 అక్షర సవాల్:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని మాంటిస్సోరి హై స్కూల్‌లో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నర్సరీ నుంచి 6వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని,పాఠశాల ఆవరణలో వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. చిన్నారులు తమ ఇళ్ల నుంచి తెచ్చిన వంటకాలను పరస్పరం పంచుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పంచుకునే భావన,మంచి అలవాట్లు,ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ప్రిన్సిపాల్ కొత్త మధుకర్ రెడ్డి మాట్లాడుతూ ఫుడ్ ఫెస్టివల్‌ల ద్వారా విద్యార్థుల్లో సామాజిక విలువలు,సహకార భావం పెంపొందుతాయని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల కరస్పాండెంట్ తాటిపర్తి అంజన్ రెడ్డి విద్యార్థులకు పరిశుభ్రతపై సూచనలు చేశారు. ఆహారం తయారీకి ముందు,తినే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని,శుభ్రమైన పాత్రలు ఉపయోగించాలని,ఆహారాన్ని కప్పి ఉంచాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ట్రెజరర్ డాక్టర్ ఆర్. ఆనందరావు మాట్లాడుతూ,విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పుష్టికరమైన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరికి నిరసన



**ధర్మారంలో బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం**

**గీసుగొండ, ఏప్రిల్ 18 । అక్షర సవాల్:** పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునేందుకు కాంగ్రెస్ ఎంపీలు చేసిన ప్రయత్నాలను ఖండిస్తూ, గీసుగొండ మండలం 16వ డివిజన్ ధర్మారం గ్రామంలో బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. బీజేపీ అధ్యక్షురాలు జాలిగాపు ప్రసన్న రాంప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను వ్యతిరేకించడం మహిళల హక్కులను దెబ్బతీయడమేనని అన్నారు. మహిళా సాధికారత పేరుతో మాట్లాడే కాంగ్రెస్ పార్టీ అసలు వైఖరి పార్లమెంట్‌లో బయటపడిందని విమర్శించారు. మహిళల అభివృద్ధి, శ్రేయస్సు కోసం బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళా సాధికారతకు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గట్టికొప్పుల రాంబాబు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గోదాసి అశ్విని కుమార్, 15వ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా సీనియర్ నాయకులు అరే కుమారస్వామి, సుంకరి రాజు, జిల్లా కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతికుమార్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ల్యాద రాజేష్, డివిజన్ సీనియర్ నాయకుడు బైకని వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సంకతల శ్రీనివాస్ తదితరులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కుమారస్వామితో సీఎం రేవంత్ భేటి

**న్యూఢిల్లీ:**బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ (ఉక్కు పరిశ్రమ) ఏర్పాటు చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్ డి కుమారస్వామి కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఉక్కు కొరత తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు. కేంద్ర మంత్రి కుమారస్వామి, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తో ముఖ్యమంత్రి ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను కేంద్ర మంత్రులకు వివరించారు. తెలంగాణలో పాత వాహనాల స్క్రాప్తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులను కోరుతూ ఈ సందర్భంగా వినతిపత్రం అందించారు. అందుబాటులో ఉన్న సాంకేతికత, భారీ పరిశ్రమలు, పారిశ్రామిక ఉత్పత్తికి ఉన్న



అనుకూలతల వలన దేశ పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యాలకు హైదరాబాద్ కేంద్రంగా నిలవగలదని వివరించారు. హైదరాబాద్ లో హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఆటో, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. అలాగే మెషిన్ టూల్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక పరికరాల తయారీకి ప్రత్యేక పార్కు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ను 2034 నాటికి కాలుష్యం లేని నెట్ జీరో నగరంగా మార్చే లక్ష్యంతో వాహనాలను ఈవీలుగా మార్చేందుకు సహకరించాలని కోరారు. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు నేర్పే జాతీయ స్థాయి సంస్థలను హైదరాబాద్లో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

# ధదూర్ లో మాజీ మంత్రి సబిత పర్యటన

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్

**వికారాబాద్:**వికారాబాద్ జిల్లా ధరూర్ మండలంలోని నాగసన్నల్లి, తరిగోపుల, అల్లిపూర్ గ్రామాల్లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా జొన్న, మొక్కజొన్న పంట రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతులకు తగిన మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి ఎరువులు అందించేవారని, ప్రస్తుతం రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆమె ఆరోపించారు.నెల క్రితమే జిల్లా కలెక్టర్కు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. ఇప్పటివరకు రైతులు కేవలం 20 శాతం పంటను మాత్రమే అమ్మేందుకు సిద్ధంగా ఉంచారని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మిగతా పంట పొలాల్లోనే ఉండిపోయిందని పేర్కొన్నారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి జిల్లా కలెక్టర్ దీపక్ తివారితో ఫోన్లో మాట్లాడి తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నిల్వ ఉన్న పంటలను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ రైతులు మొక్కజొన్న పంటను అమ్మేందుకు గ్రామాల్లో రోడ్లపై ఎండబెట్టి సిద్ధంగా ఉంచారని చెప్పారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో వర్షాలు పడితే పంటను కుప్పలు చేసి మళ్లీ ఎండబెట్టేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో పంట కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఎన్ శుభప్రతిపట్టే, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ నిలిచిపోయిన రిటర్న్స్.. రీసేల్ మార్కెట్ వెలవెల!

**హైదరాబాద్, ఏప్రిల్ 18:**హైదరాబాద్ నగరం నలుమూలలా ఇప్పుడు ఆకాశహర్మ్యాలే కనిపిస్తున్నాయి. అపరిమితమైన ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ సౌలభ్యంతో బిల్డర్లు 40-50 అంతస్తుల మేర భవనాలను నిర్మిస్తున్నారు. అయితే, పైకి చూడముచ్చటగా కనిపిస్తున్న ఈ భవనాల వెనుక ధరలు, అయోమయ మౌలిక వసతులు దాగున్నాయనే చర్చ మొదలైంది.హైదరాబాద్లో రూ. 2 కోట్ల పైబడిన ఫ్లాట్ల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. పశ్చిమ హైదరాబాద్లోని ఐటీ కారిడార్ ఈ ధరలకు కేంద్రబిందువుగా మారింది. అయితే కొత్త లాంచ్‌లలో ఉన్న జోరు రీసేల్ మార్కెట్‌లో లేకపోవడం, మౌలిక సదుపాయాల కొరత వంటివి ఇన్వెస్టర్లను, గృహ కొనుగోలుదారులను కలవరపెడుతున్నాయి. 2026 మొదటి త్రైమాసికంలో కొత్త ప్రాజెక్టుల లాంచ్‌లు ఏకంగా 46శాతం పడిపోవడం మార్కెట్ మందగమనానికి సంకేతంగా కనిపిస్తోంది.ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా, ముఖ్యంగా రెడిట్ వంటి ప్లాట్‌ఫారమ్స్‌లో నెటిజన్లు లేవనెత్తుతున్న ప్రశ్నలు ఇన్వెస్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. "హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో చదరపు అడుగుకు రూ. 8,000 నుంచి రూ. 12,000 వసూలు చేస్తున్నారు. కానీ, వర్షం వస్తే ఆ రోడ్లపై నడవగలమా? డ్రైనేజీ వ్యవస్థ ఉందా? కనీసం తాగునీటి సరఫరా ఉందా?" అని కొనుగోలుదారులు నిలదీస్తున్నారు.పశ్చిమ హైదరాబాద్లోని ఐటీ కారిడార్‌లో సుమారు 20,000కు పైగా లగ్జరీ యూనిట్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. ఈ భారీ భవనాల్లో వేల సంఖ్యలో కుటుంబాలు చేరితే, ఇప్పటికే ఊపిరాడని ట్రాఫిక్‌తో సతమతమవుతున్న ఆ ప్రాంత మౌలిక వసతులు ఆ భారాన్ని మోయగలవా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. సరైన రోడ్లు, డ్రైనేజీ లేని చోట రూ. 2 కోట్లు పోసి ఫ్లాట్ కొనడం 'లగ్జరీ' అనిపించుకుంటుందా లేక 'నరకం' అవుతుందా అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.రియల్ ఎస్టేట్ రంగంలో ఎప్పుడైనా రీసేల్ మార్కెట్ బలంగా ఉంటేనే ఆ రంగం ఆరోగ్యంగా



ఉన్నట్టు లెక్క అని నిపుణులు చెబుతుంటారు.కానీ హైదరాబాద్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది.: మూడేళ్ల క్రితం ఒక కోటి రూపాయలు పెట్టి కొన్న ఫ్లాట్, ఈరోజు అమ్మాలంటే కొనేవారే లేరు! ఒకవేళ ఉన్నా, కొన్న ధరకే అడగడం లేదా అంతకంటే తక్కువకు బేరం చేయడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

బ్యాంకు వడ్డీలు కలుపుకుంటే, మూడేళ్ల తర్వాత ఆ ఆస్తి విలువ పెరగకపోగా, ఇన్వెస్టర్లు నికరంగా నష్టపోతున్నారు. "మా స్నేహితుడు పెట్టుబడి కోసం లగ్జరీ అపార్ట్‌మెంట్ కొన్నాడు, ఇప్పుడు బయటపడలేకపోతున్నాడు," అని ఒక బాధితుడు పేర్కొన్నాడు.నివాస యోగ్యం కాని ప్రాంతాలు: భారీ నిర్మాణాల వల్ల వచ్చే దుమ్ము, తక్కువ జనాభా వంటి కారణాలతో కొత్త కమ్యూనిటీలు కేవలం పేరుకే 'హైటెక్'గా మిగిలిపోతున్నాయని, పాత నగరంలో ఉన్న సౌకర్యం, అనుబంధం ఇక్కడ లేవని కొందరు అభిప్రాయపడుతున్నారు.

**హైదరాబాద్ రియల్ ఎస్టేట్- అసలు ఈ డిమాండ్‌ను నడిపిస్తోంది ఎవరు?**

ధరలు ఇంతలా ఉన్నా, కొత్త లాంచ్‌లలో బుకింగ్స్ జరుగుతున్నాయని బిల్డర్లు చెబుతున్నారు. దీని వెనుక ప్రధానంగా మూడు శక్తులు ఉన్నాయి:ఐటీ రంగంలోని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, భారీగా ఈ-సాప్స్ పొందిన టెక్కీలు ఆఫీసులకు దగ్గరగా ఉండాలనే ఉద్దేశంతో ఈ భారీ ధరలకు వెనకాడటం లేదు.: డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం ప్రవాస భారతీయులకు కలిసి వస్తోంది. వారు హైదరాబాద్‌ను ఒక సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ జోన్‌గా చూస్తున్నారు.: తెలంగాణలో భూముల ధరలు పెరగడంతో, తమ ఊర్లలో భూములు అమ్మిన వారు ఆ డబ్బును నగరంలోని లగ్జరీ ఫ్లాట్లపై పెడుతున్నారు.: బిల్డర్లు ఎక్కువ అంతస్తులు కట్టే అవకాశం ఉండటంతో క్లబ్‌హౌస్‌లు, గ్రీన్ స్పేస్‌లు వంటి సౌకర్యాలతో ప్రాజెక్టులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

**2026 మొదటి త్రైమాసికం: ఒక హెచ్చరిక!**

నోబ్రోకర్ నివేదిక ప్రకారం, 2026 క్యూ1లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ భారీ కరెక్షన్‌ను చూసింది. నివాస గృహాల లాంచ్‌లు ఏకంగా 46% పడిపోయాయి. గతంలో నెలకు వేల సంఖ్యలో కొత్త యూనిట్లు మార్కెట్లోకి వచ్చేవి, కానీ మార్చి నెలలో కొత్త సరఫరా దాదాపు శూన్యం.హైదరాబాద్‌లో 80శాతం కంటే ఎక్కువ ఫ్లాట్లు 3బీహెచ్కే లేదా అంతకంటే పెద్దవి మాత్రమే ఉంటున్నాయి. సగటు ఫ్లాట్ సైజు 2,050 చదరపు అడుగులుగా ఉంది. సామాన్య మధ్యతరగతి వ్యక్తికి అవసరమైన 2బీహెచ్కే లేదా చిన్న ఫ్లాట్లు మార్కెట్ నుంచి మాయమైపోతున్నాయి. దీనివల్ల దాదాపు 84% మంది కొనుగోలుదారులు "అఫర్డబిలిటీ స్ట్రెస్" (ధర భరించలేకపోవడం) ఎదుర్కొంటున్నారు.

**హైదరాబాద్ రియల్ ఎస్టేట్- భవిష్యత్తు ఏంటి?**

అపరిమిత ఎఫ్ఎస్ఐ అనేది ఒక వరంలా కనిపించినా, అది నిర్మాణ వ్యయాన్ని కూడా విపరీతంగా పెంచేస్తోంది. ఆకాశహర్మ్యాలు కట్టాలంటే కావాల్సిన ఇంజనీరింగ్ టెక్నాలజీ, సేఫ్టీ సిస్టమ్స్ వల్ల బిల్డర్లపై భారం పడుతోంది. అది తిరిగి కస్టమర్ల మీదనే పడుతోంది. మౌలిక వసతులు మెరుగుపడకుండా కేవలం భవనాలు మాత్రమే పెరిగితే, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ బబుల్ పేలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# బీజేపీని ముంచేస్తున్న సొంత నేతలు

- మొదటి పేజీ తరువాయి

తెచ్చేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఆయన నిరంతరం జిల్లాల్లో పర్యటిస్తూ, కార్యకర్తలను కలుస్తూ పార్టీలో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో అధ్యక్షుడు పడుతున్న కష్టానికి ఇతర ముఖ్య నాయకుల నుండి ఆశించిన మద్దతు లభించడం లేదనే విమర్శలు బలంగా ఉన్నాయి. పార్టీని తమ సొంత సంస్థగా భావించి పని చేయాల్సిన అగ్ర నేతలు, కేవలం తమ వ్యక్తిగత అజెండాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, దీనివల్ల సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని పార్టీ అంతర్గత వర్గాలు చర్చించుకుంటున్నాయి.ఏ పార్టీలోనైనా పాత వారు, కొత్తగా వచ్చిన వారి మధ్య చిన్నపాటి ఘర్షణలు సహజం. కానీ తెలంగాణ బీజేపీలో ఈ అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ఇతర పార్టీల నుండి వచ్చిన సీనియర్ నేతలకు, పార్టీని నమ్ముకున్న పాత కాపులకు మధ్య సయోధ్య కుదరడం లేదు. బయటకు అందరూ నవ్వుతూ కనిపిస్తున్నా, లోపల మాత్రం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, ఎదుటివారిని తక్కువ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కవరింగ్ రాజకీయాల వల్ల పార్టీ ఎదుగుదల కుంటుపడుతోందని



విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణలో రాజకీయ పరిస్థితులు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని భావించి, కాషాయ తీర్థం పుచ్చుకోవాలని భావిస్తున్న పెద్ద తలకాయలు ఇప్పుడు వెనకడుగు వేస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం పార్టీలో ఉన్న నేతలేనని తెలుస్తోంది. ఎవరైనా కొత్త నేతలు పార్టీలోకి వస్తామంటే, ప్రస్తుతం ఉన్న నాయకులు వారిని ప్రోత్సహించాల్సింది పోయి, "మాకే దిక్కు లేదు, మమ్మల్ని ఇక్కడ ఎవరూ గౌరవించడం లేదు, మీరు వచ్చి ఏం చేస్తారు?" అంటూ భయపెట్టి నిరుత్సాహపరుస్తున్నారట. ఈ పరిస్థితి వల్ల పార్టీలోకి రావాలనుకున్న వారు పెనం మీద నుంచి పొయ్యిలో పడటం ఎందుకని భావిస్తూ ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు.బీజేపీలో నెలకొన్న ఈ వింత పరిస్థితికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఉదాహరణగా నిలుస్తున్నారు. ఆయన బీజేపీలో చేరడం ఖాయమని, కేవలం ముహూర్తం మాత్రమే బాకీ ఉందని పార్టీ నేతలే స్వయంగా ప్రచారం చేశారు. కానీ అనూహ్యంగా ఆయన కమలాన్ని కాదని గులాబీ గూటికి చేరుకున్నారు. ఆయన పార్టీ మారడానికి బీజేపీలోని అంతర్గత కుమ్ములాటలు, నాయకుల మధ్య ఉన్న విభేదాలే ప్రధాన కారణమని ఇప్పుడు పార్టీలో చర్చ మొదలైంది. ఒక సీనియర్ నేతను కూడా పార్టీలోకి ఆహ్వానించి, నిలబెట్టుకోలేని స్థితిలో తెలంగాణ బీజేపీ ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇతర రాష్ట్రాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని చేర్చుకుని, వారికి ఉన్నత పదవులు ఇచ్చి పార్టీని అధికారంలోకి తెస్తున్న హైకమాండ్ వ్యూహాలు తెలంగాణలో మాత్రం రివర్స్ అవుతున్నాయి. క్షేత్రస్థాయిలో క్యాడర్ సిద్ధంగా ఉన్నా, నాయకుల మధ్య ఐక్యత లేకపోవడం వల్ల పార్టీకి నష్టం జరుగుతోంది. ఇప్పటికైనా అగ్ర నాయకత్వం జోక్యం చేసుకుని ఈ అంతర్గత విభేధాలను పరిష్కరించకుంటే, అధికారంలోకి రావాలన్న కల కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# రేవంత్...నేషనల్ స్ట్రాటజిస్ట్..

- మొదటి పేజీ తరువాయి



తెరపైకి తెచ్చారు. ఉత్తరాది రాష్ట్రాలకు కోపం రాకుండా, అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు గండి పడకుండా ఆయన ప్రతిపాదించిన ఈ వినూత్న ఫార్ములా ఇప్పుడు కాంగ్రెస్ అధికారిక విధానంగా మారుతోంది. సంక్లిష్టమైన సమస్యలకు సరళమైన, ఆమోదయోగ్యమైన పరిష్కారాలు చూపడం ద్వారా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఒక 'థింక్ ట్యాంక్'గా మారారు.రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో 'స్టార్ క్యాంపెయినర్'గా దూసుకుపోతున్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక వంటి కీలక విషయాల్లో రేవంత్ చొరవ చూపడం ఆయన స్థాయికి నిదర్శనం. గతంలో అహ్మద్ పటేల్ వంటి నేతలు పోషించిన వ్యూహాత్మక పాత్రను రేవంత్ రెడ్డి భర్తీ చేస్తున్నారనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. దక్షిణ భారతదేశంలో బీజేపీని నిలువరించాలంటే రేవంత్ లాంటి దూకుడున్న నేత అవసరమని ఏఐసీసీ గట్టిగా నమ్ముతోంది.ప్రస్తుతం రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో ఒక స్వర్ణయుగం నడుస్తోంది. అటు రాష్ట్రంలో తిరుగులేని నాయకుడిగా పాలన సాగిస్తూనే, ఇటు కేంద్రంలో మోదీ సర్కార్‌ను సూటిగా ప్రశ్నించే గొంతుకగా మారారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన కేవలం ఒక ముఖ్యమంత్రి మాత్రమే కాదు, రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయాల్లో భారీ మార్పులకు శ్రీకారం చుట్టే ఒక బలమైన 'పొలిటికల్ అస్సెట్'. రేవంత్ రెడ్డి రూపొందిస్తున్న ఈ 'తెలంగాణ మోడల్' వ్యూహాలు రేపు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పూర్వవైభవానికి పునాది వేస్తాయనడంలో సందేహం లేదు.

# రక్తసంబంధం వర్సెస్ రాజకీయ పంతం

- మొదటి పేజీ తరువాయి

ప్రతిసారీ కవిత వర్గం అసంతృప్తి వ్యక్తం చేయడం, తాజాగా ఆమె కొత్త పార్టీ పెట్టబోతూండటం పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ సభ్యుల మధ్య ఉండే రహస్యాలు, లోపాలు రాజకీయ ప్రత్యర్థులకు బలమైన అస్త్రాలుగా మారుతున్నాయి. ఏపీలో షర్మిల చేసే విమర్శలను టీడీపీ, జనసేన తమకు అనుకూలంగా మలుచుకుంటుంటే.. తెలంగాణలో కవిత అరెస్ట్ లేదా ఆమెపై వచ్చే ఆరోపణలను కాంగ్రెస్, బీజేపీలు కేసీఆర్ , ప్రస్తుత పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీయడానికి వాడుకుంటున్నాయి. "ఇంటిని చక్కదిద్దుకోలేని వారు రాష్ట్రాన్ని ఏం చక్కదిద్దుతారు అనే విమర్శలను ఈ రెండు పార్టీలు ఎదుర్కోవాల్సి వస్తోంది.ప్రాంతీయ పార్టీలు ప్రధానంగా ఒక బలమైన నాయకుడి చుట్టూ, ఆ కుటుంబం చుట్టూ కేంద్రీకృతమై ఉంటాయి. అన్నాచెల్లెళ్లు విడిపోవడం వల్ల ఆ కుటుంబానికి ఉన్న సింపతీ ఓటు బ్యాంకు రెండుగా చీలిపోతుంది. ఏపీలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు జగన్, షర్మిల మధ్య నలిగిపోతుంటే.. తెలంగాణలో కేసీఆర్ వారసులుగా కేటీఆర్, కవితలో ఎవరిని నమ్మాలో తెలియక కేడర్ నిరాశలో ఉంది. ఈ చీలిక అంతిమంగా అధికార పక్షాలకు వరంగా మారుతోంది. నేతల మధ్య గొడవలు కేవలం పైస్థాయిలోనే ఉండవు, అవి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు చేరుతాయి. వారసత్వ పోరు ఎప్పుడూ ప్రాంతీయ పార్టీల బలహీనతకే దారితీసింది. అన్నాచెల్లెళ్ల ఈ సవాళ్లు సద్దుమణగకపోతే.. రెండు రాష్ట్రాల్లోనూ బీఆర్ఎస్, వైసీపీలు తమ ఉనికిని కాపాడుకోవడం కష్టతరమే. కుటుంబాల్లోని చిచ్చు.. రాజకీయంగా ప్రత్యర్థులకు పెరటిలో పండగలా మారుతుందనడంలో సందేహం లేదు.

# సీనియర్ నేత జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో బిఆర్ఎస్ కు మరింత బలం...

- మొదటి పేజీ తరువాయి

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, లోక్సభ, రాజ్యసభలో బిల్లులు పాసై, రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ప్రజాస్వామిక పద్ధతిలో తెలంగాణ ఏర్పడింది. కనీస అవగాహన లేకుండా తెలంగాణపై, ఉద్యమంపై బీజేపీ నేతలు విషం చిమ్ముతున్నారు. ఒక ఎంపీ తప్పు మాట్లాడితే ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం దాన్ని ఖండించాల్సింది పోయి సమర్థించడం దారుణమని అన్నారు.బీజేపీ తక్షణమే తేజస్వి వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలి. లేదంటే తెలంగాణ మనోభావాలను దెబ్బతీసిన పార్టీగా బీజేపీ మిగిలిపోతుంది. నిన్నటి లోక్సభ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు స్పష్టంగా కనిపించింది. మన ఎంపీలు సభలో ఉండి ఉంటే తేజస్వికి తెలంగాణ బిడ్డల తరపున దీటైన, మూతి పగిలే సమాధానం చెప్పేవాళ్లం. మన రాష్ట్రం నుంచి 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా పెదవులు మూసుకొని మౌనంగా కూర్చున్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంటే ప్రశ్నించాల్సిన బాధ్యత మీపై లేదా? అదే రాజ్యసభలో ఉన్న ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలు మాత్రం ప్రాజెక్టులపై అవాకులు చవాకులు పేలిన కేంద్ర జల వనరుల మంత్రికి దీటైన సమాధానం ఇచ్చారు. స్పీకర్ను కలిసి ఆధారాలు చూపించి రికార్డులను సైతం సవరించారు. రేవంత్ రెడ్డి, బీజేపీ మధ్య ఉన్న బడే భాయ్ ఛోటే భాయ్ బంధం మరోసారి బట్టబయలైంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల ఇళ్లను ముట్టడించాలని బీజేపీ పిలుపునిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం ఢిల్లీలో బీజేపీ కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ ఇంటికి భోజనానికి వెళ్లాడు. కార్యకర్తలేమో కొట్లాడుకోవాలి.. మీరేమో విందులు చేసుకోవాలా.. డీలిమిటేషన్ పై రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ విధానం' ఏంటో ఇవాళ స్పష్టమైంది. అది హైబ్రిడ్ కాదు క్రాస్ బ్రీడ్ అని అర్థమైంది. ఈ క్రాస్ బ్రీడ్ సిద్ధాంతం రాహుల్ గాంధీకి, సోనియా గాంధీకి అర్థమవుతుందో లేదో. బడే భాయ్ కి భయపడే, తెలంగాణను అవమానించిన తేజస్వి సూర్య వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటిదాకా కనీసం స్పందించలేదు. మహిళా రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్లమెంటులో కొట్లాడినట్లు నాటకాలు ఆడుతూ మహిళలకు తీరని ద్రోహం చేశాయి. మహిళా బిల్లుకు నిజంగా చట్టబద్ధత కల్పించాలనుకుంటే దాన్ని డీలిమిటేషన్ ప్రక్రియతో ఎందుకు ముడిపెట్టారని ప్రశ్నించారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై

# కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్ర విమర్శలు



**హైదరాబాద్:**మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావును శనివారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. సీఎం నివాసాన్ని ముట్టడించేందుకు వెళ్లకుండా ఆయన నివాసం వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్‌లో మహిళల గొంతు నొక్కారని, రాష్ట్రంలో తమ నిరసనలను అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని ఆయన అన్నారు. 2023లో ఈ బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్, ఇప్పుడు వ్యతిరేకంగా ఓటు వేయడం వారి నిజ స్వరూపాన్ని బయటపెడుతుందని విమర్శించారు.మహిళల సాధికారతపై మాటల్లో మద్దతు ఇచ్చి, ఆచరణలో అడ్డుకోవడం కాంగ్రెస్ విధానమని ఆయన పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే సామాన్య మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు పెరుగుతాయని, అయితే కుటుంబాధిపత్య రాజకీయాలు చేసే కాంగ్రెస్‌కు ఇది ఇష్టం లేదని రాంచందర్ రావు ఆరోపించారు. గత 30 ఏళ్లుగా మహిళా బిల్లును వాయిదా వేస్తూ వస్తోందని కూడా విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరించిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోంది: హరీశ్ రావు



**జగిత్యాల, ఏప్రిల్ 18:** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలు ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశాయని వ్యాఖ్యానించారు. బీజేపీ ఎంపీని కిషన్ రెడ్డి వెనుకేసుకొస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్ – పాక్ విభజనతో తెలంగాణను పోల్చుతారా అంటూ మాజీ మంత్రి మండిపడ్డారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని హరీశ్ రావు తెలిపారు. ఎంపీ తప్పు మాట్లాడితే.. క్షమాపణ చెప్పాల్సింది పోయి వెనుకేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. తేజస్వి సూర్య మూతి పగిలే సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారన్నారు. మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ.. రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు.

## ఆ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం రేవంత్ ధన్యవాదాలు



**న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 18:** వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు(శనివారం) ఉదయం సమావేశమయ్యారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు విషయాలను ప్రియాంక గాంధీ బయటపెట్టారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల తరఫున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ధన్యవాదాలు తెలియజేశారు. 'దక్షిణాది రాష్ట్రాలను ఏకీకృతం చేయడంలో నా కృషిని ప్రియాంక గాంధీ అభినందించారు' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో బిజీబిజీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పారిశ్రామిక విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటుకు విన్నవించారు. ఆటో, రక్షణ రంగాల ఉత్పత్తులు, రోబోటిక్స్ తయారీకి ప్రత్యేక పార్కుల కోసం ప్రతిపాదించారు ముఖ్యమంత్రి. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కేంద్రం సహకారం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అనుగుణంగా జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కుమార స్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## దక్షిణాదికి విపక్షాల చారిత్రక ద్రోహం..

**రక్షణ కవచం లాంటి బిల్లును చంపేశారు: బండి సంజయ్**

**దక్షిణాది గౌరవం పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శ**

**రాజకీయ స్వార్థం కోసం చారిత్రక సంస్కరణను అడ్డుకున్నారని మండిపాటు**



నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకోవడాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... కాంగ్రెస్, ఇండియా కూటమిపై నిప్పులు చెరిగారు. బయట 'దక్షిణాది గౌరవం' అంటూ డ్రామాలు ఆడే విపక్షాలు, పార్లమెంటులో మాత్రం ఆ ప్రాంత గొంతు నొక్కేలా వ్యవహరించడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని సంజయ్ మండిపడ్డారు. 2026 తర్వాత జరగబోయే పునర్విభజన వల్ల జనాభా నియంత్రణ పాటించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యత కోల్పోయే ప్రమాదం ఉందని, దానిని అడ్డుకునేందుకే ప్రధాని మోదీ ఈ 'రక్షణ కవచం' లాంటి బిల్లును తెచ్చారని బండి సంజయ్ వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దక్షిణాది సీట్లను 50 శాతం పెంచేందుకు సిద్ధమని స్పష్టమైన హామీ ఇచ్చినా విపక్షాలు స్పందించకపోవడం దారుణమన్నారు. కేవలం రాజకీయ స్వార్థం కోసమే ఈ చారిత్రక సంస్కరణను అడ్డుకుని, దక్షిణాది ప్రజలకు కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరగబోయే సీట్ల కోతకు విపక్షాలే బాధ్యత వహించాలని, ఈ ద్రోహాన్ని ప్రజలు క్షమించరని ఆయన హెచ్చరించారు.

# అడగంటుతున్న భూ గర్భజలాలు

**కరీంనగర్, ఏప్రిల్ 18:** వేసవిలో ఎండల తీవ్రత అంతకంతకు పెరుగుతుండగా, కరీంనగర్ జిల్లాలోని నీటివనరులన్నీ నిండుకున్నాయి. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు అడుగంటి ఒండ్రు మట్టి తేలితున్నాయి. జిల్లా పరిధిలోని చిన్న, మధ్య తరహా, భారీ ప్రాజెక్టుల్లో కూడా నీటి నిల్వలు అడిగంటుతున్నాయి. ఉక్కపోత, భరించలేని వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూడా నీటిని అదే స్థాయిలో వినియోగిస్తున్నారు. ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడుతోంది. చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నా రు. తమ స్థిరాస్తులు, ఆభరణాలు తనాఖా పెడుతూ, అట్టడుగుకు చేరిన నీటిని పైకి తె చ్చేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. నీటిమట్టంపై జిల్లా భూగర్భ జలవనరుల శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ ఏడాది మార్చిలో 8.10 మీటర్లు, ఏప్రిల్ లో 9.02 మీటర్ల సగటు నీటిమట్టం నమోదైంది. గత ఏడాది వేసవిలో కూడా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలమట్టంలో మార్పు వచ్చి, కొంతమేర ఉపశమనం



కలిగింది. అనంతరం అసలు రెయినీ సీజన్లోనే వర్షా లు ముఖం చాటేయగా, ఎప్పటికప్పుడు భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నా యి. అడపాదడపా వర్షాలు కురిసినా వాటి తో భూగర్భజలాలు పెరగలేదని భూగర్భ జల వనరుల శాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో వేసవి తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వరి పంట కు సరిపడా నీరు అందకపోవడంతో పం టలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ బావుల్లో పేరుకుపోయిన మట్టిని క్రేన్ల సహాయంతో తొలగిస్తున్నారు. నీటి నిల్వలు పెరగాలని ఆశిస్తూ పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టి బావులను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా, మరింత నీరు అం దుబాటులోకి రావాలనే ఉద్దేశంతో బావుల పక్కనే సైడ్ బోర్లు కూడా వేయిస్తున్నారు. కరీంనగర్ ఎల్ఎండీ సామర్థ్యం 24.034 టిఎంబసీ లు కాగా జలాశయంలో నీటి నిల్వలు 6.9 టీఎంసీలకు పడిపోవడంతో నగరంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. గతంలో ప్రతిరోజూ 55 ఎంఎల్డీల నీటిని సరఫరా చేసిన నగరపాలక సంస్థ, రెండు రోజులకు ఒకసారి సరఫరా చేసేందుకు సిద్ధం అవుతుంది ఎంఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. మిడ్ మానేరు నుంచి ప్రస్తుతం 500 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

# కమలం గూటికి మల్లారెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ రాజకీయాల్లో ఆయన ఒక సంచలనం. టీడీపీ నుంచి ఎంపీగా గెలిచారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. కానీ రేవంత్‌రెడ్డితో ఉన్న విభేదాల కారణంగా చేరిక జరగలేదు. ఇప్పటికే ఆయన ఎవరో అర్థమై ఉంటుంది కదూ.. హా ఆయనే.. పూలమ్మిన.. పాలమ్మిన.. స్కూల్ పెట్టిన.. కాలేజీలు పెట్టిన.. ఎంపీగ గెలిచిన.. ఎమ్మెల్యేగ గెలిచిన.. మంత్రి అయినా అంటూ తన వాక్చాతుర్యం, బాడీ లాంగ్వేజ్‌తో ఆకట్టుకునే మల్లారెడ్డి. ప్రస్తుతం అధికారంలో లేరు. దీంతో సైలెంట్ అయ్యారు. అయితే ఇటీవల ఆయన కోడలు, మల్లారెడ్డి విద్యాసంస్థల కో చైర్‌పర్సన్ ప్రీతిరెడ్డి యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇటు సోషల్ మీడియాలో, అటు రాజకీయాల్లో ఆమె ప్రముఖంగా వినిపిస్తున్నారు. ఈ క్రమంలో మల్లారెడ్డి ప్రధాని మోదీతో భేటీకావడం ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాంశమైంది. ప్రీతిరెడ్డి గతంలోనే ఎంపీ పదవి కోసం ఆసక్తి చూపారు. బండి సంజయ్‌ను ఆమె కలవడం, స్వయంగా పార్లమెంటరీ స్థానం కోరుకుంటున్నట్టు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ గుర్తులోకి వచ్చాయి. మల్లారెడ్డి ఈ సమావేశంలో ప్రధానిని ఆమె పక్షాన కోరుతూ మధ్యవర్తిగా వ్యవహరించారా? ఇది ఒక వైపు లాభదాయకమైన రాజకీయ కుట్రగా కనిపిస్తోంది. ఈ భేటీ ఫలితంగా ప్రీతికి టికెట్ దక్కితే, మల్లారెడ్డి కూడా బీజేపీలో చేరే అవకాశం ఉందా? బీఆర్ఎస్‌లో ఇప్పటికే భిన్నాభిప్రాయాలు తలెత్తుతున్న నేపథ్యంలో, ఇది పార్టీ మార్పు సూచనగా కనిపిస్తుంది. బీజేపీ తెలంగాణలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలనుకుంటే, స్థానిక నాయకులను ఆకర్షించడం సహజం. అయితే, ఇది బీఆర్ఎస్‌కు మరో షాక్‌గా మారవచ్చు. ఈ సంఘటన తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది. కుటుంబ ఆధారిత రాజకీయాలు ఎప్పుడూ



వివాదాస్పదం. బీజేపీ ఎమ్మెల్యేలను, ఎంపీలను పెంచుకోవడం ద్వారా తన పట్టుకు బలం చేకూర్చుకుంటుందా? రానున్న రోజుల్లో ఈ చర్చలు మరింత ఉద్ధృతమవుతాయి.

# గ్యాస్ ఏజెన్సీల దందా...

**వరంగల్, ఏప్రిల్ 18:** హనుమకొండ జిల్లాలో గ్యాస్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు సామాన్య ప్రజలకు, చిరు వ్యాపారులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్లైన్ బుకింగ్ పేరుతో జాప్యం చేస్తూ.. మరోవైపు అధిక ధరలకు బ్లాక్లో సిలిండర్లను విక్రయిస్తూ ఏజెన్సీలు కాసుల వేటలో పడ్డాయనే విమర్శలు బాహటంగా వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఫలితంగా, దోపిడీ పర్వం యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వస్తున్నాయిగ్యాస్ కొరత కారణంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొంతకాలం గడువు విధిస్తూ ఆన్లైన్ బుకింగ్ విధానం వినియోగదారులకు సౌకర్యంగా ఉండాల్సింది పోయి, ఇబ్బందుల పాలయ్యేలా చేస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక సిలిండర్ బుక్ చేస్తే అది ఇంటికి చేరడానికి 20 రోజులకు పైగా సమయం పడుతోందని, దీనివల్ల సామాన్యులు కట్టెల పొయ్యి వైపు చూడాల్సిన పరిస్థితి తలెత్తుతుందని చెబుతున్నారు. వెంటనే ఈ ఆన్లైన్ విధానాన్ని పక్కన పెట్టి, పాత పద్ధతిలోనే ఇంటింటికీ సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని ఏజెన్సీలు, డెలివరీ బాయ్ లు అనుసరిస్తున్న కొత్త తరహా మోసం వినియోగదారులను విస్మయానికి గురిచేస్తోంది. గ్యాస్



పంపిణీ చేయకముందే వినియోగదారుల వద్ద నుంచి రకరకాల సాకులతో ఓటిపి లను సేకరిస్తున్నారు. సాఫ్ట్వేర్లో డెలివరీ అయినట్లు చూపిస్తూ.. ఆ సిలిండర్లను బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వంట గ్యాస్ ధర అధికారికంగా రవాణా చార్జీలతో కలిపి 1000 ఉండగా, బ్లాక్లో రూ. 2 వేలకు విక్రయిస్తున్నారని, ఇక ఇదే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 1850 ఉండగా, ఏకంగా 3వేలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్యాస్ ధరల సెగ హోటల్ యజమానులకు, బజ్జీల బండి వ్యాపారులకు గట్టిగా తగులుతోంది. కమర్షియల్ గ్యాస్ ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరడంతో వ్యాపారాలు సాగించడం భారంగా మారింది. పోనీ కట్టెల పొయ్యి మీద వంట చేద్దామన్నా.. కట్టెల ధరలు కూడా వేలల్లో ఉండటంతో 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' చందంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నా, పౌరసరఫరాల శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్న గ్యాస్ ఏజెన్సీల గోదాములపై దాడులు నిర్వహించి, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గృహ, వాణిజ్య వినియోగదారులు కోరుతున్నారు. గ్యాస్ పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై సివిల్ సప్లై డిటి సదానందం స్పందిస్తూ.. వినియోగదారుల వద్ద నుంచి ముందస్తుగా ఓటిపిలు సేకరించడం, సిలిండర్లను బ్లాక్ మార్కెట్కు తరలించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా గ్యాస్ ఏజెన్సీలు కృత్రిమ కొరత సృష్టించినా లేదా ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే ప్రత్యేక బృందాలతో ఏజెన్సీ గోదాముల్లో తనిఖీలు నిర్వహిస్తామని, అక్రమాలు రుజువైతే ఏజెన్సీ లైసెన్సులను రద్దు చేయడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. వినియోగదారులు ఎవరైనా ఇబ్బందులకు గురైతే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

# మార్కెట్ లో మ్యాంగో హవా

**రంగారెడ్డి, ఏప్రిల్ 18:** పండ్లకు రారాజు అయినా మామిడి సీజన్ వచ్చింది. మార్కెట్ లో మ్యాంగో హవా మొదలైంది. హైదరాబాద్ శివారు ప్రాంతమైన బాటసింగారంలోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్కు మామిడి కాయల రాక క్రమంగా పెరుగుతూ ఉంది రాష్ట్రంలో అతిపెద్ద పండ్ల మార్కెట్ కావడంతో రైతులు, వర్తకులు, చిరు వ్యాపారులు, వినియోగదారులతో సందడి వాతావరణం నెలకొంది. ఈ ఏడాది ధరలు కొంత ఆశాజనకంగా ఉండటంతో క్రయ, విక్రయాలు ఊపందుకుంటున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మార్కెట్ లో మామిడి క్రయ విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. బాటసింగారం మార్కెట్ లో మామిడి కుప్పలతో నిండిపోయాయి. ఆంధ్రప్రదేశ్ కర్ణాటక, తెలంగాణలోని అల్లాపూర్, గద్వాల్, రంగారెడ్డి నల్గొండ, వరంగల్, సూర్యాపేట్, మహబూబ్నగర్, తిమ్మాజీపేట్, కరీంనగర్, వికారాబాద్, అనంతపూర్, పరిగి, వనపర్తి, యాదగిరిగుట్ట, అంకిరావుపల్లి, చారకొండ తదితర ప్రాంతాల నుంచి మామిడి లోడ్లతో లారీలు, గూడ్స్ వాహనాలు, ఆటో ట్రాలీలు పండ్ల మార్కెట్ కు తరలివస్తున్నాయి. ఇప్పటివరకు సుమారు 2,48, 219 క్వింటాళ్లు దిగుమతులు ఎగుమతులు జరిగాయి. నాణ్యతనుబట్టి టన్నుకు సగటున రూ.30 వేల నుంచి రూ.40 వేల ధర పలు కుతోంది. మంచి రకాలకు క్వింటా 1 లక్ష పలుకుతుంది. మార్కెట్ కు వచ్చిన మామిడిని రాజస్థాన్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. బాటసింగారంలోని గడ్డిఅన్నారం



వ్యవసాయ మార్కెట్ కు ప్రస్తుతం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బెనిషాన్, తోతా పూరి, హిమాయత్, నాతి, పెద్ద రసాలు, చిన్న రసాలు, సుందరి, మల్లిక, కేసరి, దాసేరి, అప్పుసా తదితర రకాల మామిడి పండ్లు దిగుమతి అవుతున్నట్లు అధికారులు తెలిపారు. వీటిల్లో అత్యధిక ధర హిమాయత్ రకం కిలో రూ.200 ధర పలు కుతుండగా, అత్యల్పంగా నాటి రకం కిలో రూ.8–14 ధర పలుకుతోంది. వీటిలో చెట్టుపైనే కవర్ కట్టిన పండ్లకు అధిక డిమాండ్ ఉండడంతో పాటు ధర కూడా టన్నుకు రూ. లక్ష వరకు పలుకు తోందని అధికారులు పేర్కొంటున్నారు. మార్కెట్ లో క్రయవిక్రయాలు సజావుగా సాగే విధంగా, ఎలాంటి ఇబ్బందులకు లేకుండా ఏర్పాట్లు చేశాం. మార్కెట్ ప్రాంగణంలో మామిడి పండ్లతో వచ్చే వాహనాలు సాఫీగా రాక పోకలు సాగించేలా అంతర్గత రోడ్లు నిర్మించాం. మార్కెట్ లో రైతులు, వ్యాపారులు దాహం తీర్చుకునేందుకు చల్లటి తాగునీటి యంత్రాలు ఏర్పాట్లు చేశాం. మామిడిని ప్యాకింగ్ చేసే క్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు అనుమతులు ఇచ్చిన ప్రకారమే ఇథలిన్ ప్యాకెట్లను మోతాదులో వాడే విధంగా వ్యాపారులకు సూచనలు చేశాం. నిబంధనలను అతిక్రమిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటున్నారు అధికారులు

## బీజేపీ మిత్రపక్షాలకు భవిష్యత్తులో ఇబ్బందులే

**సీఎం రేవంత్ రెడ్డి**




**ఢిల్లీ, ఏప్రిల్ 18 :** బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనుగడ భవిష్యత్తులో కష్టంగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక్ నాథ్ షిండేల పరిస్థితి మనం ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. ఈరోజు(శనివారం) ఢిల్లీలో మీడియాతో సీఎం చిట్‌చాట్ చేశారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉండటంతో.. టీడీపీకి ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. వాటిని అమల్లోకి తీసుకువచ్చేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార యంత్రాంగమని తెలిపారు. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తాను రాజుగా 2/ 3వ వంతు మెజార్టీతో చట్టం చేసుకుంటే ఎవరూ ఒప్పుకోరు కదా అని ప్రశ్నించారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు కేంద్రం రిజర్వేషన్ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.



# కారా డైరెక్టర్ షాకింగ్ కామెంట్స్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కారా'. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో ధనుష్ 'కరసామి' అనే పత్తి రైతు పాత్రలో కనిపించబోతున్నారు. ఇందులో ధనుష్ సరసన 'ప్రేమలు' బ్యూటీ మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న డైరెక్టర్ మరిన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'నీ దగ్గర ఏదైనా ఆసక్తికరమైన కథ ఉండి, నాకు వినిపించాలనుకుంటే.. నేను వినడానికి సిద్ధంగా ఉన్నాను. ఒకవేళ నువ్వు నాతో కలిసి పనిచేయాలనుకుంటే, మనం ఒప్పందం కుదుర్చుకుని వెంటనే నిర్మాణాన్ని ప్రారంభిద్దాం అని ధనుష్ ఒకసారి నాతో అన్నారు. తర్వాత 2024లో ఈ సినిమా కథ నేను ఆయనకు వినిపించాను. మేము 2025లోనే చిత్రీకరణ స్టార్ట్ చేసినప్పటికీ కథా రచన (స్క్రిప్ట్) కోసం మాత్రం చాలా సమయం తీసుకున్నాము. దాదాపు 9 నెలల సమయం పట్టింది. అంతే కాకుండా స్క్రిప్ట్ పని పూర్తిగా కంప్లీట్ అయ్యేవరకు అగ్రిమెంట్ చేసుకోకూడదు అని ముందుగానే మేము నిర్ణయించుకున్నాము. ఎందుకంటే ఈ రోజుల్లో, ప్రేక్షకులను మెప్పించడానికి కేవలం ఒక మంచి సినిమా తీస్తే సరిపోదు. మనం వారి అంచనాలను మించిపోయేలా రాణించాల్సి ఉంటుంది.. పూర్తిగా ఈ కథ పనులు పూర్తయ్యాకే దీనిపై అగ్రిమెంట్ చేసుకున్నాము' అని చెప్పుకొచ్చారు.




# శ్రీనివాస మంగాపురం టీజర్ అప్‌డేట్

సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మూడో తరంగా ఇండస్ట్రీ ఎంట్రీకి సిద్ధం అయ్యాడు దివంగత రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని. 'శ్రీనివాస మంగాపురం' అనే క్రేజీ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి లేటెస్ట్‌గా సాలిడ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఇందులో నుంచి టీజర్ రాబోతుందని తెలుపుతూ.. 'నిష్కల్మషత్వంలో పాతుకుపోయిన రెండు హృదయాలు.. తీవ్రతతో నిండిన ఒక గాథ.. శ్రీనివాస మంగాపురం టీజర్ రేపు సాయంత్రం 6 గంటలకు విడుదల కాబోతున్నది.. ఆ ప్రపంచం ఆవిష్కృతమవడాన్ని వీక్షించడానికి సిద్ధంగా ఉండండి' అంటూ ఓ క్యూట్ పోస్టర్‌ను షేర్ చేశారు. ప్రజెంట్ ఈ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కాగా.. 'ఖీచీ 100', 'మంగళవారం' వంటి సెన్సేషనల్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న కల్ట్ డైరెక్టర్ అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. చందమామ కథలు వంటి వైవిధ్యమైన చిత్రాలను నిర్మించిన బ్యానర్‌పై ప్రఖ్యాత నిర్మాత అశ్వనీదత్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు.?ఈ సినిమా ద్వారా బాలీవుడ్ బ్యూటీ రవీనా టాండన్ కూతురు రాషా తడాని టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

# యాక్షన్ డ్రామాతో రాబోతున్న రాశీ ఖన్నా

యంగ్ హీరోయిన్ రాశీ ఖన్నా తన కెరీర్‌లో ఒక గట్టి హిట్ కోసం ఎదురుచూస్తోంది. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆమెకు అదృష్టం అంతగా కలిసి రావడం లేదు. చివరగా హిందీలో 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రంతో హిట్ కొట్టి ఈ భామకు.. తెలుగులో భారీ అంచనాల మధ్య వచ్చిన తెలుసు కదా, ఉస్తాద్ భగత్ సింగ్ వంటి చిత్రాలు ప్రేక్షకులను పూర్తిస్థాయిలో మెప్పించలేకపోవడంతో, ఇప్పుడు ఆమె తన ఆశలన్నీ ఓటీటీపైనే పెట్టుకుంది. రాశీ ఖన్నా తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఒక విభిన్నమైన మ్యూజికల్ యాక్షన్ డ్రామాగా ఎంచుకుంది. 'లుఖ్కే' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ క్రేజీ సిరీస్‌లో పాపులర్ ర్యాపర్ కింగ్ హీరోగా పరిచయం అవుతున్నారు. హిమాంక్ గౌర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లో పాలక్ తివారి, శివాంకిత్, లక్ష్య వీర్ శరణ్ ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. పంజాబ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కథలో రాశీ ఖన్నా లుక్ పర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. పంజాబ్‌లోని ర్యాప్ మ్యూజిక్ కల్చర్, దాని వెనుక ఉన్న డ్రగ్ సిండికేట్, పగ – ప్రతీకారాల నేపథ్యంలో ఈ సిరీస్ సాగుతుంది. సంగీత ప్రపంచంలోని చీకటి కోణాలను చూపిస్తూనే, పక్కా యాక్షన్ ఎలిమెంట్స్‌తో దీన్ని రూపొందించారట మేకర్స్. సినిమాల్లో ఆశించిన సక్సెస్ రాకపోయినా, ఈ డిజిటల్ సిరీస్ ద్వారా తన సత్తా చాటాలని రాశీ ఖన్నా గట్టి పట్టుదలతో ఉంది. ఇక ఈ భారీ వెబ్ సిరీస్ డైరెక్ట్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్‌లో మే 8 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కింగ్ మార్క్ మ్యూజిక్, రాశీ ఖన్నా గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ సిరీస్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న రాశీ ఖన్నాకు 'లుఖ్కే' అయినా మంచి హిట్ ఇస్తుందని ఆమె అభిమానులు ఎదురుచూస్తున్నారు.



# రుక్మిణి ప్లేస్‌లో మరో యంగ్ క్రేజియస్ట్ బ్యూటీ!



విభిన్న కథలతో కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో కూడా తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుని ప్రస్తుతం స్టార్ హీరోగా దూసుకుపోతున్నాడు ధనుష్. ఆయన గ్యాప్ ఇవ్వకుండా బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులు అనౌన్స్ చేస్తూ బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తున్నాడు. అలాగే ప్రస్తుతం ఈ హీరో తన 56వ చిత్రంపై కూడా ఫోకస్ పెట్టినట్లు టాక్. తమిళ దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడని తెలుస్తుండగా.. ఇందులో ఫీ మేల్ లీడ్ కోసం రుక్మిణి వసంత్‌ను ఓకే చేసినట్లు టాక్ వచ్చిన విషయం తెలిసిందే. 'కాంతార', 'ఏస్', 'మదరాసి' వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ ప్రస్తుతం చేతులో వరుస ప్రాజెక్టులు పెట్టుకుని బిజీ అయిపోయింది. ఈ క్రమంలోనే ధనుష్ 56వ చిత్రానికి గాను డేట్ సమస్యల కారణంగా ఈ మూవీ నుంచి రుక్మిణిని తప్పించినట్లు టాక్. అలాగే ధనుష్ సరసన హీరోయిన్‌గా సారా అర్జున్‌ను లైన్‌లో పెట్టారట మేకర్స్. టాక్స్ ఫైనల్ అయితే.. దీనిపై త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ అవకాశం ఉన్నట్లు కోలీవుడ్ వర్గాల నుంచి సమాచారం.

# ప్లీజ్ ఒక్క చాన్స్ ఇవ్వండి!



తెలుగులో మెంటల్ మదిలో, చిత్రలహరి వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్ ఇప్పుడు మళ్లీ వార్తల్లో నిలిచింది. ఒకప్పుడు వరుస అవకాశాలతో బిజీగా ఉన్న ఈ నటి, తన వ్యక్తిగత కారణాల వల్ల సినిమాలకు కాస్త విరామం ఇచ్చింది. అయితే, ఇప్పుడు ఆమె మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నివేదా తన కెరీర్ జోరుగా సాగుతున్న సమయంలోనే బిజినెస్ మెన్ రజిత్ ఇబ్రాన్‌తో ప్రేమలో పడింది. అతనితో జీవితాన్ని పంచుకోవాలని నిర్ణయించుకున్న ఆమె, 2023లో సినిమాలకు దూరం అయింది. అంతేకాకుండా తన ప్రియుడితో క్లోజ్‌గా దిగిన ఫొటోలను షేర్ చేస్తూ.. కాబోయే భర్తను పరిచయం చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక పెళ్లి బంధంతో ఒక్కటికాబోతున్నట్లు కూడా హింట్ ఇచ్చేసింది. దీంతో అంతా పెళ్లి చేసుకుని సెటిల్ అయిపోతుందని భావించారు. ఈక్రమంలోనే.. విధి వైపరీత్యం వల్ల వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుండి ప్రియుడితో ఉన్న ఫోటోలన్నీ తొలగించి బ్రేకప్‌పై అందరికీ హింట్ ఇచ్చేసింది. తాజాగా రజిత్ మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకోవడంతో, నివేదా తన గతాన్ని వదిలేసి మళ్లీ కెరీర్ మీద దృష్టి పెట్టిందట. ప్రస్తుతం నివేదా మళ్లీ వెండితెరపై మెరవాలని ఆరాటపడుతోంది. ఇందులో భాగంగా ఆమె టాలీవుడ్‌లోని పాత మేకర్స్‌ను, దర్శకులను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.

## బిజినెస్

### గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి ఆరు రెట్లు పెరిగిన పెట్టుబడులు




పసిడి ధరలతో పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యం లో ఇన్వెస్టర్లు సంప్రదాయ 'సురక్షిత ఆస్తి' బంగారంలో పెట్టుబడులకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే 2026, మార్చి త్రైమాసికంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు ఏకంగా 6 రెట్లు పెరగడమే దీనికి సాక్ష్యం. ముఖ్యంగా బంగారం ధరలు ఊహించని విధంగా రికార్డు గరిష్ఠాలకు చేరడంతో చిన్న మొత్తం గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెట్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్‌లు) కొనుగోళ్లు అత్యంత వేగంగా పెరిగాయి. మార్చితో ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి మొత్తం రూ. 31,561 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది గతేడాది మార్చి త్రైమాసికంలో వచ్చిన రూ. 5,654 కోట్ల కంటే దాదాపు ఆరు రెట్లు అధికం. త్రైమాసిక పరంగా కూడా అంతకుముందు డిసెంబర్ త్రైమాసికంలో రూ. 23,132 కోట్ల కంటే 36 శాతం పెరిగాయని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ (యాంఫీ) పేర్కొంది. గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడులు పెరగడంతో గోల్డ్ ఫండ్ల ఆస్తులు గతేడాది రూ. 58,888 కోట్ల నుంచి మూడు రెట్లు పెరిగి రూ. 1.71 లక్షల కోట్లకు చేరింది.

### ఆర్థిక వ్యవస్థకు చమురు సెగ



పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ హెచ్చరించింది. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడం భారత్‌కు పెను సవాలుగా మారనుందని ఈ నివేదికలో విశ్లేషించింది. ఒకవేళ 2026లో ముడిచమురు సగటు ధర బ్యారెల్‌కు 130 డాలర్ల మార్కును తాకితే.. భారత ఆర్థిక వృద్ధి రేటు ఏకంగా 80 బేసిస్ పాయింట్లు లేదా 0.80 శాతం మేర పడిపోయే ప్రమాదం ఉందని సంస్థ అంచనా వేసింది. పశ్చిమాసియా సెగ కేవలం ఇంధన ధరలకే పరిమితం కాకుండా సరఫరా గొలుసులో అంతరాయాల ద్వారా గృహాలు, కార్పొరేట్ సంస్థలు, బ్యాంకింగ్ రంగంపై కూడా ఒత్తిడి పెంచుతుందని ఎస్అండ్‌పి హెచ్చరించింది. ఈ చమురు షాక్ ప్రభావంతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత కార్పొరేట్ రంగం భారీ నష్టాలను చవిచూడాల్సి రావచ్చు. ప్రధానంగా కంపెనీల నిర్వహణ లాభాలు 15 నుంచి 25 శాతం వరకు క్షీణించే అవకాశం ఉందని.. దీంతో సంస్థల రుణ భారం పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయని ఎస్అండ్‌పి విశ్లేషించింది. బ్యాంకింగ్ రంగం విషయానికి వస్తే ఆస్తుల నాణ్యత తగ్గి మొండి బకాయిలు 3.5 శాతానికి చేరవచ్చని అంచనా వేసింది. ముఖ్యంగా రసాయన, రిఫైనింగ్, ఏవియేషన్ రంగాలు ఈ ధరల పెరుగుదల వల్ల నేరుగా దెబ్బతినే అవకాశం ఉంది. పెరిగిన దిగుమతి ఖర్చుల వల్ల కరెంట్ అకౌంట్ లోటు పెరగడమే కాకుండా రూపాయి విలువపై కూడా క్షీణత ఒత్తిడి పెరుగుతుందని నివేదిక పేర్కొంది. యుద్ధ తీవ్రత తగ్గి హార్మూజ్ జలసంధి వంటి కీలక మార్గాల్లో రవాణా సాధారణ స్థితికి చేరుకుంటే 2027 నాటికి ఆర్థిక వ్యవస్థ మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని పేర్కొంది.

# ఆటోకు వార్ దెబ్బ

## దేశీయ పరిశ్రమకు సవాళ్లేనంటున్న సియామ్

పశ్చిమాసియాను కుదిపేస్తున్న అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో దేశీయ ఆటోమోటివ్ పరిశ్రమకు తీవ్ర ఇబ్బందులే ఎదురుకావచ్చని మంగళవారం భారతీయ ఆటోమొబైల్ తయారీదారుల సమాజం (సియామ్) అధ్యక్షుడు శైలేష్ చంద్ర అన్నారు. వాహనాల డిమాండ్‌పై పరోక్ష ప్రభావం ఉండొచ్చని 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసిన నేపథ్యంలో ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. 'మిడిల్ ఈస్ట్ సంక్షోభం నుంచి తలెత్తిన అనిశ్చిత పరిస్థితులను నిశితంగా గమనించాల్సిన అవసరం ఉన్నది. ప్రస్తుత భౌగోళిక, రాజకీయ పరిస్థితులను చూస్తే.. ఆటోమోటివ్ ఉత్పాదకత చిక్కుల్లో పడవచ్చు. విడిభాగాల ధరలు, ఇంధన చార్జీలు, రవాణా ఖర్చులు సమీప కాలంలో ఆటో ఇండస్ట్రీకి సవాల్‌గా మారగలవనిపిస్తున్నది' అని చెప్పారు. గల్ఫ్ వార్‌తో భారతీయ ఆటో ఇండస్ట్రీకి ముడి సరుకుల కొరత రావచ్చని శైలేష్ హెచ్చరించారు. ముఖ్యంగా పెట్రో కెమికల్స్ తయారీలో వినియోగించే ప్రొపేన్, ఇథిలీన్ సరఫరాలో సమస్యలు ఏర్పడవచ్చని, అలాగే వాహనాలకు వేసే రంగుల తయారీ కూడా చిక్కుల్లో పడవచ్చన్నారు. తద్వారా మార్కెట్‌లో వాహనాల డిమాండ్ ప్రభావితం కావచ్చని పేర్కొన్నారు. వార్‌లో అమెరికా-ఇజ్రాయెల్‌కు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆయా దేశాల్లో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తికి దాదాపుగా బ్రేకులుపడ్డాయి. అంతేగాక గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హ్పార్మూజ్ జలసంధిని ఇరాన్ ఇంచుమించుగా మూసివేయడంతో నౌకాయానం సమస్యల్లో పడింది.



చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొనడంతో దూరం పెరిగి రవాణా సమయం, వ్యయం మితిమీరిపోతున్నదని శైలేష్ అంటున్నారు. అలాగే షిప్పింగ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. అంతిమంగా దిగుమతిదారులపైనే ఈ భారం పడుతుండగా.. ఇది ఆయా ఉత్పత్తుల ధరల పెరుగులకు దారితీస్తున్నది. ఈ క్రమంలోనే రాబోయే 4-5 వారాల్లో ఆయా కంపెనీలు వివిధ వాహనాల ధరల్ని పెంచే అవకాశాలూ లేకపోలేదని వ్యాఖ్యానించారు. ఇప్పటికే పలు సంస్థలు ఆయా మాడళ్ల రేట్లను పెంచిన సంగతి విదితమే. కాగా, పెరిగే పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ తదితర ఇంధన ధరలతోనూ వాహనాల అమ్మకాలు పడిపోవచ్చన్న ఆందోళన ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నది.

## ఇరాన్ యుద్ధం వల్ల భారత్‌లో 25 లక్షల మంది పేదరికంలోకి

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్‌పైన మరింత ప్రభావం చూపనున్నాయి. ఈ పరిణామాల వల్ల మనదేశంలో 25 లక్షల మంది ప్రజలు పేదరికంలోకి జారిపోయే ప్రమాదం ఉందని, అలాగే మానవ అభివృద్ధి పురోగతిలో దేశం కొంత నష్టాన్ని చూడక తప్పదని ఐక్యరాజ్యసమితి అంచనాలు వెల్లడిస్తున్నాయి. 'మధ్యప్రాచ్యం లో సైనిక ఉద్రిక్తతలు: ఆసియా, పసిఫిక్ ప్రాంత మానవ అభివృద్ధిపై ప్రభావాలు' అనే శీర్షికతో ఐక్యరాజ్యసమితి డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ) విడుదల చేసిన నివేదికలో.. ఈ యుద్ధం అధిక ఇంధనం, రవాణా, ముడిసరుకుల ఖర్చుల ద్వారా ఆసియా, పసిఫిక్ ప్రాంతమంతటా మానవాభివృద్ధిపై ఒత్తిళ్లను పెంచుతోంది. ఇది దేశంలోని ప్రజల కొనుగోలు శక్తిని, ఆహార భద్రతను తగ్గిస్తోంది. ప్రభుత్వ బడ్జెట్లపై భారం మోపడమే కాకుండా, జీవనోపాధిని బలహీనపరుస్తోందని నివేదిక పేర్కొంది. ఇరాన్ యుద్ధ పరిస్థితుల తర్వాత దేశంలో పేదరికం రేటు 23.9 శాతం నుంచి 24.2 శాతానికి పెరుగుతుందని, దీనివల్ల 24,64,698 మంది ప్రజలు పేదరికంలోకి వెళ్తారని నివేదిక తెలిపింది. సంక్షోభానికి ముందు 35,15,69,000 మంది పేదరికంలో ఉండగా, సంక్షోభం తర్వాత దేశంలో ఈ సంఖ్య సుమారుగా 35,40,33,698కి చేరుతుందని నివేదిక



అంచనా వేస్తోంది. మరోవైపు, ఈ యుద్ధ ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా కూడా 88 లక్షల మంది ప్రజలు పేదరికంలోకి జారిపోయే ప్రమాదంలో ఉన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ఆసియా-పసిఫిక్‌కు 299 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో రూ. 27.82 లక్షల కోట్ల) వరకు నష్టం వాటిల్లవచ్చు. చైనాలో పేదరికంలోకి జారిపోయే ప్రమాదంలో ఉన్న వారి సంఖ్య సుమారు 1,15,000 నుంచి 6,20,000కు పైగా పెరుగుతుందని నివేదిక అంచనా వేసింది.

# హాజిల్‌వుడ్ దెబ్బ.. పంత్ అబ్బ!

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ పేలవ ఆటతీరు ప్రదర్శిస్తోంది. ఆర్సీబీ బౌలర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోతూ వస్తోంది. ఈ సంగతి పక్కనబెడితే ఆర్సీబీ బౌలర్ జోష్ హాజిల్‌వుడ్ వేసిన బంతి పంత్‌ను గాయపర్చింది. లక్నో ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో ఇది చోటుచేసుకుంది. 12 పరుగుల చేసి మార్క్‌రమ్ ఔటైన తర్వాత పంత్ క్రీజులోకి వచ్చాడు. ఆ తర్వాత నాలుగో ఓవర్ హాజిల్‌వుడ్ వేశాడు. హాజిల్‌వుడ్ వేసిన తొలి మూడు బంతులను పంత్ జాగ్రత్తగా ఆడాడు. నాలుగో బంతిని పంత్ షాట్ ఆడే ప్రయత్నం చేశాడు. అయితే బంతి మిస్సయ్యి పంత్ ఎడమ మోచేతిని బలంగా తాకింది. బంతి బులెట్‌లా దూసుకురావడంతో దెబ్బకు పంత్ మోచేతి వాచిపోయింది. ఈ సమయంలో పంత్ నొప్పిని తట్టుకోలేక కన్నీళ్లు పెట్టడం కెమెరాలకు చిక్కింది. ఫిజియో వచ్చి పంత్‌ను పరీక్షించాడు. ఆ తర్వాత



రిటైర్డ్ హర్ట్ అయిన పంత్ డగౌట్‌కు వెళ్లిపోతున్న క్రమంలో హాజిల్‌వుడ్‌కు గాయమైన తన మోచేతిని చూపించడం

గమనార్హం. అయితే ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పంత్ ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. క్రీజులో ఉన్నంత సేపు ఇబ్బందిగా కనిపించిన పంత్ ఆరు బంతులెదుర్కొని ఒక్క పరుగు మాత్రమే చేసి భువనేశ్వర్ బౌలింగ్‌లో సాల్ట్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంత్ తర్వాతి మ్యాచ్ ఆడేది అనుమానమే. మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (40) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ముకుల్ చౌదరీ (39), ఆయుశ్ బదోని (38) పర్వాలేదనిపించారు.

## స్పోర్ట్స్

### నా శరీరంలో ఇప్పటికీ ఆ అవశేషాలు

### కుమార సంగక్కర



ఏళ్లు గడిచినా.. ఆ దాడి తాలూకా జ్ఞాపకాలు మాత్రం ప్లేయర్లను వదలడం లేదు. 2009లో పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన శ్రీలంక ప్లేయర్ల బస్‌పై ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా.. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో శ్రీలంక ప్లేయర్లూ ఉన్నారు. అప్పట్నుంచి కొన్ని సంవత్సరాలు పాకిస్థాన్‌లో ఆడేందుకు కొన్ని జట్లు విముఖత చూపించాయి. తటస్థ వేదిక పైనే ఆడాల్సిన పరిస్థితి పాక్‌కు ఎదురైంది. ఉగ్రదాడిలో కుమార సంగక్కర, అజంత మెండిస్, తిరంగ, సురంగ, తిలాన్ సమరవీర, తుషారా గాయపడ్డారు. ఆ ఘటనపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో కుమార మాట్లాడాడు. ఇప్పటికీ తన శరీరంలో ఆ ప్రమాదానికి సంబంధించి బాంబు అవశేషాలు ఉన్నట్లు వెల్లడించాడు. "ఆ రోజు (మార్చి 3, 2009) పాక్-శ్రీలంక జట్ల మధ్య టెస్టు థర్డ్ డే. హోటల్ నుంచి గ్రౌండ్‌కు వెళ్లాలని సిద్ధమయ్యాం. మా జట్టులోని ఓ ఫాస్ట్ బౌలర్ 'ఈ ఫ్లాట్ ట్రాక్ దెబ్బకు మా బ్యాక్ బ్రేక్ అవుతోంది.

# సూర్యకు బైబై!.. భారత టీ20 కెప్టెన్.. టాప్-5 ప్లేయర్లు వీరే!

సొంతగడ్డపై టీమిండియాకు ఇటీవల టీ20 ప్రపంచకప్ టైటిల్ అందించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్. అయితే, అతడి భవితవ్యంపై క్రికెట్ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. గత కొంతకాలంగా సారథిగా సూపర్ హిట్ అవుతున్నా.. బ్యాటర్‌గా మాత్రం స్థాయికి తగ్గట్లు రాణించలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో సెలక్టర్లు సైతం సూర్యను కొనసాగించాలా వద్దా? అన్న అంశంపై తీవ్రంగా చర్చిస్తున్నట్లు సమాచారం. ఐపీఎల్ ముగిసిన వెంటనే జరిగే ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో సిరీస్‌లలో అతడి ప్రదర్శనను పరిశీలించిన అనంతరమే వారు అంతిమ నిర్ణయానికి రానున్నారు. వచ్చే రెండేళ్లలో ఆస్ట్రేలియా వేదికగా టీ20 ప్రపంచకప్ (2028)తో పాటు లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ (2028) జరగనున్నాయి. వీటికి సూర్యకుమార్ సారథ్యంలోనే సిద్ధం కావాలా లేక కొత్త నాయకుడిని ఎంపిక చేయాలా అనే విషయంపై సెలక్టర్లు ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనతో ఒక అవగాహనకు రానున్నారు.

**విషమ పరీక్ష**

ఈ టూర్‌లో అటు సారథిగా, ఇటు ప్లేయర్‌గా సూర్యకుమార్‌కు విషమ పరీక్ష కానుంది. గౌతమ్ గంభీర్ 2028 ఒలింపిక్స్ వరకు టీమిండియా హెడ్‌కోచ్‌గా కొనసాగే అవకాశాలున్న నేపథ్యంలో... సూర్యకుమార్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ప్రస్తుతం 35వ పడిలో ఉన్న సూర్యకుమార్ ఒలింపిక్స్ సమయానికి ఫిట్‌గా ఉంటాడా అనేది అనుమానమే. 'సూర్యకుమార్ ప్రస్తుతం జట్టును నడిపిస్తున్నాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనకు అతడే కెప్టెన్ అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే ఆ తర్వాత పరిస్థితి ఏంటి అనేది అందులో అతడి ప్రదర్శనపై ఆధారపడి ఉంటుంది' అని బీసీసీఐ అధికారి తెలిపారు. గతేడాది పేలవ ఆటతీరు కనబర్చిన సూర్యకుమార్ కనీసం ఒక్క హాఫ్‌సెంచరీ కూడా నమోదు చేయలేకపోయాడు. ఈ ఏడాది ఫర్వాలేదనిపించిన ఈ ముంబైకర్... వరల్డ్‌కప్ ఆరంభంలో ఆకట్టుకున్నా... కీలక మ్యాచ్‌ల్లో మాత్రం విఫలమయ్యాడు. సౌతాఫ్రికాపై 18 పరుగులు, వెస్టిండీస్‌పై 18 పరుగులు, ఇంగ్లండ్‌పై 11 పరుగులు చేసిన సూర్యకుమార్... న్యూజిలాండ్‌తో ఫైనల్లో డకౌటయ్యాడు. ఒకవేళ సూర్యను సెలక్టర్లు తప్పిస్తే.. అతడి స్థానంలో టీమిండియా టీ20 కెప్టెన్ కాగల అర్హత ఉన్న టాప్-5 ఆటగాళ్లు ఎవరో తెలుసా?

**శుబ్‌మన్ గిల్**



ఇప్పటికే టీమిండియా టెస్టు, వన్డే పగ్గాలు చేపట్టాడు శుబ్‌మన్ గిల్. అయితే, టీ20 జట్టు కెప్టెన్సీ విషయంలో మాత్రం బీసీసీఐ గిల్ గురించి వెంటనే నిర్ణయం తీసుకోలేకపోవచ్చు. ఆసియా కప్-2025తో టీ20 జట్టులో పునరాగమనం చేసిన అతడు వరుసగా విఫలం కావడం ఇందుకు కారణం. అయితే, ఐపీఎల్-2026లో గనుక బ్యాటర్‌గా గిల్ సత్తా చాటితే అతడి ఎంపిక లాంఛనమే అవుతుంది. కాగా ఫామ్‌లేమి కారణంగా గిల్‌ను టీ20 ప్రపంచకప్-2026 జట్టు నుంచి సెలక్టర్లు తప్పించిన సంగతి తెలిసిందే.

**హార్దిక్ పాండ్యా**

నిజానికి 2024లో టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత రోహిత్ శర్మ అంతర్జాతీయ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత కెప్టెన్ కావాల్సింది హార్దిక్ పాండ్యానే. అయితే, అనూహ్యంగా యాజమాన్యం సూర్యకు పగ్గాలు అప్పగించింది.

ఆ సమయంలో.. అరుదైన పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అయిన హార్దిక్ పాండ్యాపై అధిక భారం పడకుండా.. తాము ఈ నిర్ణయం తీసుకున్నటుట్లు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ తెలిపాడు. కాబట్టి సూర్య స్థానంలో హార్దిక్‌ను సారథిగా ఎంపిక చేస్తారా లేదా అన్నది చర్చనీయాంశం. ఐపీఎల్‌లో కెప్టెన్‌గా అతడికి అనుభవం ఉంది.

**సంజూ శాంసన్**

జట్టులో స్థానం సుస్థిరం చేసుకోలేకపోయిన సంజూ శాంసన్... టీ20 ప్రపంచకప్-2026లో టీమిండియా గెలవడంలో కీలక పాత్ర పోషించి హీరో అయ్యాడు. సూపర్-8 నాకౌట్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 97 పరుగులతో అజేయంగా నిలిచిన ఈ కేరళ వికెట్ బ్యాటర్.. ఇంగ్లండ్‌తో సెమీస్‌లో 89, న్యూజిలాండ్‌తో ఫైనల్లో 89 రన్స్‌తో దుమ్ములేపాడు. ఇక ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్‌కు సుదీర్ఘకాలం కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం సంజూకు ఉంది. కేరళ జట్టుకు కూడా గతంలో అతడు సారథ్యం వహించాడు.

**అక్షర్ పటేల్**

టీ20 వరల్డ్‌కప్-2026లో టీమిండియా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున సారథిగానూ అతడు సత్తా చాటుతున్నాడు. సూర్య వారసుడిగా అక్షర్ ఎంపికయ్యే అవకాశాలు లేకపోలేదు.

**శ్రేయస్ అయ్యర్**

ముంబై సారథిగా, ఐపీఎల్‌లో వివిధ జట్ల కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు అపార అనుభవం ఉంది. 2024లో అతడి సారథ్యంలోనే కోల్‌కతా నైట్ రైడర్స్ టైటిల్ గెలిచింది. గతేడాది పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా, బ్యాటర్‌గా ఇరగదీసి ఫైనల్‌కు చేర్చాడు.

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI** :TEL TEL / 2023/ 84132